


## నామినేషన్ కౌంటర్ (7వ రోజు)

| ఎంపీ/ఎమ్మెల్యే నియోజకర్గాలు | ఏడో రోజు నామినేషన్లు | మొత్తం |
|---|---|---|
| నరసాపురం ఎంపీ | 01 | 15 |
| 1.ఆచంట | 04 | 10 |
| 2.పాలకొల్లు | 06 | 12 |
| 3.నరసాపురం | 05 | 10 |
| 4.భీమవరం | 01 | 11 |
| 5.ఉండి | 09 | 21 |
| 6.తణుకు | 05 | 15 |
| 7.తాడేపల్లిగూడెం | 05 | 12 |
| మొత్తం | 35 | 91 |
| ఏలూరు ఎంపీ | 05 | 16 |
| 1.ఉంగుటూరు | 04 | 14 |
| 2.దెందులూరు | 07 | 14 |
| 3.ఏలూరు | 03 | 10 |
| 4.పోలవరం | 04 | 13 |
| 5.చింతలపూడి | 06 | 14 |
| 6.నూజివీడు | 04 | 12 |
| 7.కైకలూరు | 07 | 18 |
| మొత్తం | 35 | 100 |

## ధాన్యం కొనుగోళ్లపై కంట్రోల్ రూమ్ ఏర్పాటు

భీమవరం టౌన్, ఏప్రిల్ 24 : ధాన్యం కొనుగోళ్లలో ఏమైనా ఇబ్బందులుంటే కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ నెంబరు 81216 76653కు ఫోన్ చేసి తెలియజేయాలని జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య బుధవారం రైతులను కోరారు. 2023-24కు సంబంధించి రబీ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, ఏమైనా సమస్యలుంటే ఫోన్ చేయాలన్నారు.

# బిల్లులు షాక్



మా ఇంటికి నాలుగు ఫ్యాన్‌లు, ఫ్రిజ్, టీవీ ఉన్నాయి. గతంలో నెలకు రూ.300 బిల్లు వచ్చేది. ఇంత బిల్లు ఏమిటో అనుకునే వాళ్లం. అదే ఇప్పుడు వెయ్యి వస్తోంది. బిల్లు కట్టాలంటే భయమేస్తోంది. కరెంట్ బిల్లు రూపంలోనే మేం ప్రభుత్వానికి గతంకంటే దాదాపు రూ.9 వేలు చెల్లిస్తున్నాం. ఇంతలా పెరిగిపోతే మా వంటి సామాన్యుల పరిస్థితి ఏమిటి.

- ఇది భీమవరంలో రామారావు అనే దినసరి కార్మికుడి ఆవేదన.

నేను పాతికేళ్ల నుంచి రైస్‌మిల్ నడుపుతున్నా. ప్రతి నెలా లక్ష రూపాయలు కరెంటు బిల్లు వచ్చేది. ఇప్పుడు రూ.3 లక్షలు వస్తోంది. ఏడాదికి రూ.36 లక్షలు. లాభం మాట దేవుడెరుగు. నష్టాలు రాకుండా ఉంటే చాలు. గతంలో రైస్‌మిల్ అంటే పరపతి ఉండేది. ఖర్చులు పెరిగిపోయాయి. బ్యాంకులు అప్పు ఇవ్వాలంటే ఎగాదిగా చూస్తున్నాయి. మా నుంచి అన్ని రకాల పన్నులు వసూలు చేస్తున్న ప్రభుత్వం మాకు రావాల్సిన బిల్లులు ఇవ్వడానికి వెనుకంజ వేస్తోంది.

- ఇదీ ఓ రైస్ మిల్లర్ వేదన

- కరెంటు చార్జీలపై జనం కుతకుత
- ఐదేళ్లుగా పెరుగుటే తప్ప.. తగ్గింది లేదు
- ట్రూ అప్, సర్ ఛార్జీలంటూ వసూళ్లు
- అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు
- ప్రజలపై భారం మోపిన ప్రభుత్వం
- ఆక్వా రైతులు.. స్థానిక సంస్థల్లో పాట్లు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

విద్యుత్ బిల్లు వచ్చిందంటే కడదాంలే అంటూ పక్కన పడేసేవారు. దానికోసం పెద్దగా పట్టించుకునేవారు కాదు. గడువులోగా చెల్లించేసేవారు. ఇప్పుడు బిల్లు వస్తుందంటే చాలు ఆతృతగా చూస్తున్నారు. ఎంతో బిల్లు వచ్చిందో అంటూ ఒకింత గుబులుగా చూసుకుంటున్నారు. బిల్లు చూసి కెవ్వు మంటున్నారు. వైసీపీ ప్రభుత్వంలో విద్యుత్ బిల్లులు తడిసి మోపెడవుతున్నాయి. జనాల్లో విద్యుత్ చార్జీలపై నిత్యం చర్చ నడుస్తోంది. ప్రతిపక్షాలు దర్నాలు చేశాయి. సబ్ స్టేషన్‌లు ముట్టడించాయి. యూనిట్ చార్జీలు పెంచకుండా ప్రభుత్వం కొత్త ఎత్తుగడలు వేస్తోంది. ట్రూ అప్ చార్జీలు, సర్‌చార్జీలు అంటూ బిల్లులు పేలుస్తోంది. శ్లాబ్ ధరలను మార్చేసింది. విద్యుత్ బిల్లు వంద యూనిట్‌లు దాటితే యూనిట్‌కు దాదాపు రూ.7.50 వసూలు చేస్తున్నారు. ఇటీవల కాలంలో వంద యూనిట్లు దాటిన వారి సంఖ్య పెరిగింది. ఇంటి అవసరాలు అధికమయ్యాయి. విద్యుత్ వినియోగం పెరిగింది. స్లాబ్ పద్ధతిలో మార్పులు తీసుకురావడంతో విద్యుత్ బిల్లు దంచికొడుతోంది.

### ప్రభుత్వ ఆదాయం రెట్టింపు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో విద్యుత్ శాఖ ఆదాయం గడచిన ఐదేళ్లలో రెట్టింపైంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 12 లక్షల నివాస, వాణిజ్య కనెక్షన్‌లు వున్నాయి. ప్రతి నెలా రూ.184 కోట్లు ఆదాయం లభిస్తోంది. గతంలో రూ.100 కోట్లు రావడం గగనమయ్యేది. డిస్కమ్‌లకు, ట్రాన్స్‌కోకు ప్రభుత్వం నిధులు కేటాయించేది. వైసీపీ ప్రభుత్వంలో విద్యుత్ శాఖకు నష్టాలు రాకూడదంటూ చార్జీలు పెంచేస్తున్నారు. ప్రైవేటుగా తక్కువ ధరకు విద్యుత్ లభ్యమయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి, ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి సంస్థల నుంచి అధిక



ధరలకు విద్యుత్ కొనుగోలు చేస్తున్నారు. ఆ భారాన్ని విద్యుత్ వినియోగదారులపై మోపుతున్నారు. గతం లో ప్రభుత్వాలు ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి సంస్థలతో సంప్రదింపులు జరిపేవి. వాటికి ముడిసరుకును తక్కువ ధరకు ఇచ్చేలా చర్యలు తీసుకునేవి. వైసీపీ హయాంలో అటువంటి చర్యలు లేవు.ఉత్పత్తి సంస్థల నుంచి అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు. ఆ భారాన్ని ప్రజలపై మోపుతున్నారు. ఫలితంగా విద్యుత్ బిల్లులు తడిసిమోపెడవుతున్నాయి. ఎంత చెట్టుకు అంత గాలి అన్నట్టు సంపన్నులకు విద్యుత్ భారంగా మారింది. గతంలో రూ.10 వేలు బిల్లు ఇచ్చే ఇంటికి ఇప్పుడు రూ.30 వేల వరకు వస్తోంది.


ఆక్వాకు.. మీటర్లు గిరగిరా

- తాడేపల్లిగూడెంలోని ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తున్న ప్రసన్న వేతనం రూ.16 వేలు. ఇంటి అద్దె రూ.4 వేలు. దీనికి ప్రతీ నెలా రూ.800 విద్యుత్ బిల్లు. గతంలో అదే ఇంటికి రూ.250 వచ్చేది. ఇప్పుడు విద్యుత్ బిల్లు మూడింతలైంది అని ఘొల్లుమంటున్నాడు.



### ఆక్వా అధోగతి

విద్యుత్ బిల్లులు భారంతో ఆక్వా రంగం పూర్తిగా దెబ్బతింది. యూనిట్ విద్యుత్‌ను రూ.1.50లకు ఇస్తున్నట్టు ప్రభుత్వం గొప్పలు చెబుతోంది. అది కూడా పదెకరాల్లోపు ఉన్న రైతులకు మాత్రమే పరిమితం చేసింది. అదే నాన్ ఆక్వా జోన్ అయితే యూనిట్‌కు రూ.4.75 వసూలు చేస్తున్నారు. జిల్లాలో ఆక్వా రంగానికి దాదాపు 12 వేల విద్యుత్ కనెక్షన్‌లున్నాయి. అందులో నాలుగు వేల కనెక్షన్‌లు నాన్ ఆక్వా జోన్‌లోకి వెళ్లాయి. వారందరికి విద్యుత్ బిల్లులు తడిసి మోపెడవుతోంది. రాయితీ పొందిన ఆక్వా రైతులకు ఇతర రూపాల్లో భారం మోపుతున్నారు. బొగ్గు ధరలు పెరిగాయంటూ అదనపు చార్జీలను వసూలు చేస్తున్నారు. ఇలా ఆక్వా, నాన్ ఆక్వా జోన్‌లోనూ యూనిట్ ధర రూ.10లకు చేరిపోతోందంటూ రైతులు గగ్గోలు పెడుతున్నారు. చార్జీలతోపాటు, ట్రాన్స్‌ఫార్మర్ ధర రూ.5 లక్షలు చేశారు. దీంతో జిల్లాలో ఆక్వా రంగం పూర్తిగా దెబ్బ తింది. సాగు పడిపోయింది.

### పంచాయతీలకు చీకట్లు

పంచాయతీలకు ఈసారి విద్యుత్ షాక్ తగిలింది. విద్యుత్ చార్జీలు పెరిగాయి. సచివాలయాల విద్యుత్ బిల్లులను పంచాయతీలే చెల్లిస్తున్నాయి. సర్పంచ్‌లకు సచివాలయాలపై ఎటువంటి అజమాయిషీ లేదు. కార్యదర్శుల పరిస్థితి కూడా అంతే. కానీ సచివాల యాల నిర్వహణ మాత్రం పంచాయతీలు చూడాల్సి వస్తోంది. దీంతో బిల్లులు పెరిగి కట్టలేని పరిస్థితికి చేరుకున్నాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపు రూ.150 కోట్ల మేర బకాయిలు చెల్లించాలి. గతంలో ప్రభుత్వం బకాయిలు చెల్లించేది. ఆ తర్వాత ఆర్థిక సంఘం నిధులను జమ చేసుకునేది. పంచాయతీలకు ఊరట ఇచ్చేది. వైసీపీ ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను ముందుగానే మినహాయించుకుంటోంది. విద్యుత్ బిల్లులపై కనీసం స్పందించలేదు. ఇతర రూపంలోనూ పంచాయతీలకు నిధులు ఇవ్వలేదు. ఫలితంగా పంచాయతీలు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాయి. బిల్లులు చెల్లించకపోవడంతో పంచాయతీలకు విద్యుత్ సరఫరా నిలిపివేసిన సందర్భాలు వున్నాయి. నోటీసులు ఇవ్వకుండానే విద్యుత్‌ను నిలిపివేశారు. ఇలా పంచాయతీలు ఇబ్బందులు పడ్డాయి.

### బిల్లులు చెల్లించలేక ఇబ్బందులు



ఈ ఐదేళ్లలో విద్యుత్ బిల్లులు విపరీతంగా పెరిగిపోయాయి. బిల్లులు చెల్లించలేక పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీలు విద్యుత్ బిల్లులు చెల్లించలేని స్థితిలోకి వచ్చేశాయి. ఇక బిల్లులు చెల్లించాలంటూ అధికారులు తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారు. నేను ఒక సర్పంచ్‌గా మాట్లాడటం లేదు. సామాన్యురాలిగా, గృహిణిగా చెబుతున్నా. విద్యుత్ చార్జీలు తగ్గకపోతే ప్రజలు ఇబ్బందులు పడతారు.

- కోలా శేషవేణి, సర్పంచ్, దర్భిపర్రు

## మీరే నా సైన్యం.. మీరే నా ధైర్యం

- భీమవరం జనసేన అభ్యర్థి అంజిబాబు
- నామినేషన్ దాఖలు..
- భారీ ర్యాలీ.. హాజరైన కూటమి శ్రేణులు



భీమవరం టౌన్, ఏప్రిల్ 24 : 'మీరే నా సైన్యం.. మీరే నా ధైర్యం. మీ ఆశీర్వచనాలే మన గెలుపునకు అడుగులు' అని భీమవరం జనసేన అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. బుధవారం కోస్టల్ సిటీ సెంటర్(మల్టీప్లెక్స్) నుంచి ఎన్నికల అధికారి కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ, టీడీపీ సీనియర్ నాయకుడు మెంటే పార్థసారధి, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు(చినబాబు), టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజుతో కలిసి ఆర్వో శ్రీనివాసులరాజుకు అంజిబాబు నామినేషన్ పత్రాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భీమవరం నియోజవర్గ అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తానని, పదేళ్ల పాలనలో ఎమ్మెల్యేగా భీమవరాన్ని ఎంతో అభివృద్ధి చేశానని, దీనిని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. రాక్షస, అరాచకపాలన నుంచి విముక్తి కలిగించి ప్రశాంత భీమవరంగా మార్చుకుందామన్నారు. ప్రజలు గాజు గ్లాస్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని అంజిబాబు కోరారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీనివాసవర్మ మాట్లాడుతూ కేంద్ర నాయకులతో వున్న సంబంధాలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. తమను గెలిపించాలని కోరారు. జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చేపట్టిన ర్యాలీతో రహదారులు కిటకిటలాడాయి. ర్యాలీలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్‌వర్మ, ఎమ్మెల్యే మంతెన రామరాజు, జనసేన జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు, పట్టణ అధ్యక్షుడు చెన్నమల చంద్రశేఖర్, వబిలిశెట్టి రామకృష్ణ, మల్లినీడి తిరుమలరావు, కోళ్ల నాగేశ్వరరావు, మామిడిశెట్టి ప్రసాద్, పులపర్తి ప్రశాంత్ పాల్గొన్నారు.


నామినేషన్ దాఖలు చేస్తున్న అంజిబాబు

## నామినేషన్ల వరద

### పార్లమెంట్‌కు ఒకరు.. అసెంబ్లీ నియోజకవర్గాలకు 35 మంది దాఖలు

భీమవరం టౌన్, ఏప్రిల్ 24 : సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ బుధవారం ఆరో రోజుకు చేరింది. నరసాపురం ఎంపీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థి ఆనంద్ చందూలాల్ జాస్తి నామినేషన్ దాఖలు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఇప్పటి వరకు 15 మంది అభ్యర్థులు 21 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. ఇక ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు బుధవారం 35 మంది అభ్యర్థులు 41 సెట్లు దాఖలు చేశారు.

- **నరసాపురం..** కాంగ్రెస్ అభ్యర్థిగా కానూరి ఉదయ భాస్కర్‌కృష్ణప్రసాద్, భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థిగా ఆకుల వెంకటస్వామి, జై భీంరావ్ భారత్ పార్టీ అభ్యర్థిగా పోతురాజు యాకోబు, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా బందెల రాజేంద్రప్రసాద్, స్వతంత్ర అభ్యర్థిగా కంచన రమేష్ నామినేషన్లు దాఖలు చేశారు.
- **తణుకు.** నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థులుగా కోడూరి మెహర్ చైతన్య, రాపాటి రమణబాబు, కరుటూరి సుబ్బారావు, చిట్టూరి సత్యనారాయణ, జై భీం రావ్ భారత్ పార్టీ తరఫున సాకా సురేష్ నామినేషన్లు దాఖలు చేశారు.
- **పాలకొల్లు..** వైసీపీ అభ్యర్థులుగా గుడాల శ్రీహరి గోపాలరావు, గుడాల మంగతాయారు, ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, నిమ్మల సూర్యకుమారి, స్వతంత్ర అభ్యర్థిగా తమ్మా భూషణం నామినేషన్లు దాఖలు చేశారు.
- **తాడేపల్లిగూడెం..** కాంగ్రెస్ అభ్యర్థిగా మార్నిడి శేఖర్ (బాబ్జి), రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి మరపట్ల రాజు, స్వతంత్ర అభ్యర్థి సిరివరపు సింహాచలం, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి మేకా వెంకటేశ్వరరావు రెండో సెట్, జనసేన అభ్యర్థిగా బొలిశెట్టి శ్రీనివాస్ రెండో సెట్ నామినేషన్ దాఖలు చేశారు.
- **ఆచంట**లో జై భీం రావ్ పార్టీ అభ్యర్థిగా కాకి శ్యామ్ కుమార్, జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక అభ్యర్థిగా అల్లాడి సూర్యభాస్కరరావు, టీడీపీ అభ్యర్థి పితాని సత్యనారాయణ ఒక సెట్, ఆయన తనయుడు వెంకట సురేష్ రెండు సెట్లు నామినేషన్‌లు దాఖలు చేశారు.
- ఉండిలో అఖిల భారత జన సంఘ పార్టీ అభ్యర్థిగా ముదుండి రవివర్మ, స్వతంత్ర అభ్యర్థులుగా దిడ్ల ప్రేమ్‌కుమార్, ఇందుకూరి నవీన్‌వర్మరాజు, వేగేశ్న సూర్యనారాయణరాజు, గాజుల శివ, తోటకూర సుధీర్‌వర్మ, నీతి నిజాయితీ పార్టీ అభ్యర్థిగా పెనుమత్స శివరామరాజు, బహుజన పార్టీ అభ్యర్థిగా మల్లిపూడి షర్మిల, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా పార్టీ అభ్యర్థిగా అల్లూరి సతీష్‌చంద్రకుమార్ నామినేషన్లు దాఖలు చేశారు.

### నేటితో ముగియనున్న గడువు

ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభమైన సార్వత్రిక ఎన్నికల నామినేషన్లు 25వ తేదీ గురువారంతో ముగియనున్నాయి. నరసాపురం పార్లమెంట్ స్థానానికి జిల్లా కలెక్టరేట్‌లోను, ఏడు అసెంబ్లీ స్థానాలకు ఆయా నియోజకవర్గాల కేంద్రాల్లోనూ రిటర్నింగ్ అధికారులు నామినేషన్లు స్వీకరించారు. 26వ తేదీ శుక్రవారం నామినేషన్లను పరిశీలించి, సమగ్రంగా లేని వాటిని తిరస్కరిస్తారు. ఇక నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఈ నెల 29 సోమవారం మధ్యాహ్నం మూడు గంటల వరకు వుంది. అనంతరం పోటీలోవున్న అభ్యర్థులకు గుర్తులను కేటాయిస్తారు.

## కూటమి విజయం ఖాయం

- సంక్షేమంతోపాటు, అభివృద్ధి చేస్తాం
- ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ

భీమవరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల కూటమి విజయం ఖాయమని నరసా పురం ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీని వాస్‌వర్మ ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంట్ నియోజక వర్గం పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో తొలి విడత ప్రచారాన్ని శ్రీనివాస్ వర్మ పూర్తిచేశారు. కూటమి అభ్యర్థుల నామినేషన్ల దాఖలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కూటమి ఆత్మీయ సమావేశాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర నాయకుల సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తాం. జాతీయ స్థాయిలో మోదీ మళ్లీ ప్రధాని కానున్నారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయంటూ వైసీపీ చేస్తున్న వదంతులను నమ్మొద్దు. కేంద్రమే పేదల ఇళ్ల కోసం రూ.1.80 లక్షలు ఇస్తోంది. ఉచిత రేషన్ అందిస్తోంది. అమృత్ పథకాన్ని అమలు చేసి పట్టణాల్లో తాగునీరు వసతులు కల్పించేం దుకు నిధులు కేటాయిస్తోంది. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలనే వైసీపీ తనవిగా చెప్పుకుంటోంది. గడచిన ఐదేళ్లలో రాష్ట్రాన్ని అప్పులపాలు చేసింది. అభివృద్ధిని విస్మరించింది' అంటూ శ్రీనివాసవర్మ తన ప్రచారంలో పదే పదే వివరించారు. నర్సాపురం లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన అభ్యర్థులను సైకిల్, గ్లాస్ గుర్తులపై ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఎంపీ స్థానానికి కమలంపై ఓటేసి తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే కేంద్ర సహకారంతో జిల్లాలోని అన్ని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కేంద్రంలో నరేంద్ర మోదీ సహకారం, రాష్ట్రంలో చంద్రబాబు సమర్థత, జనసేన అధినేత పవన్ కల్యాణ్ చిత్తశుద్ధితో రాష్ట్రాన్ని, జిల్లాను అభివృద్ధి పథకంలో నడిస్తామని, గతంలోకంటే సంక్షేమ పథకాలు మరింతగా అమలు చేస్తామని స్పష్టం చేశారు.


ప్రచారరథంపై బీజేపీ జెండాతో శ్రీనివాసవర్మ

## జిల్లా ఎన్నికల పరిశీలకురాలిగా దీప


లోసరి చెక్ పోస్టును పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకురాలు దీప

భీమవరం టౌన్, ఏప్రిల్ 24 : జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులిగా ఎం.దీప నియమితులయ్యారు. మంగళవారం రాత్రి పొద్దుపోయాక భీమవరం చేరుకున్న ఆమెకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలోని ఓటర్లు, ఏర్పాటుచేసిన పోలింగ్ స్టేషన్లు, సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు, చెక్‌పోస్టు తదితర అంశాలపై ఆమెకు వివరించారు. పశ్చిమ గోదావరి, కృష్ణ జిల్లాల సరిహద్దులో వున్న లోసరి చెక్ పోస్టును బుధ వారం ఆమె తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్లుగా గుర్తించిన దొంగపిండి, కొత్త పూసలమర్రు, అనాకోడేరు, గొల్లవానితిప్ప గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్‌లను సందర్శించారు.

## నెల్లూరులో రోడ్డు ప్రమాదం

### ముగ్గురు ఏలూరు వాసుల మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 24 : ఏలూరుకు చెందిన ట్రాన్స్‌జెండర్ (హిజ్రా) యర్రాబత్తుల సిరి(34), ఆమె స్నేహితురాలు కొయ్యలగూడెంకు చెందిన జ్యోతి కల్యాణి(28) మంచి స్నేహితులు. తమ కాళ్లపై నిలబడాలని కొయ్యలగూడెంలో రోల్డ్ గోల్డ్ జ్యూవెలరీ ఐటెమ్స్ విక్రయించడానికి షాపును ఏర్పాటుచేశారు. అది లాభాల్లో ఉండడంతో వేరే షాపు పెట్టాలనుకున్నారు. వస్తువులు తెచ్చేందుకు వీరిద్దరితోపాటు తెలిసిన దంపతులను తీసుకుని కారులో చెన్నై బయలుదేరారు. మంగళవారం వస్తువులు కొని తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో నెల్లూరు జిల్లా కావలి మండలం జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేయబోయి మరో లారీని కారు ఢీకొంది. ప్రమాదంలో సిరి, జ్యోతి కల్యాణి, ఏలూరుకు చెందిన వంగలపూడి కుమార్(48) మృతి చెందగా కుమార్ భార్య కుమారి, కారు డ్రైవర్ బాజీ తీవ్ర గాయాలపాలై నెల్లూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎంతో స్నేహంగా ఉండే సిరి, కల్యాణి అనంతలోకాలకు వెళ్లిపోవడంతో ఏలూరులో హిజ్రాలు తల్లడిల్లిపోయారు. మృతదేహాలు బుధవారం అర్ధరాత్రి ఏలూరుకు చేరు కున్నాయి. గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.



నామినేషన్‌కు వెళితే.. ఒక రోజు ఉపాధి మస్తరు! -6లో..

జగన్మాయ

# కైకలూరు కొల్లేరే!



## • నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం • బెదిరింపులు, దౌర్జన్యాలు • ఇసుక మాఫియా

కైకలూరు నియోజకవర్గ అభివృద్ధికి వైసీపీ నేతలు ఇచ్చిన హామీలు అమలు చేయలేదు.. అభివృద్ధి ఊసే లేదు. అక్రమాలకు మాత్రం అంతులేదు. కొల్లేరు రెగ్యులేటర్ ఏర్పాటు చేస్తామని స్వయంగా జగన్ ఇచ్చిన హామీ గాలికొదిలేశారు. కొల్లేరు అభయారణ్యం పరిధిలో 10 కిలో మీటర్ల పరిధిలో పరిశ్రమల ఏర్పాటుకు ఎమ్మెల్యే కుమారులు ప్రతిపాదనలు ముఖ్యమంత్రి ముందుంచారు. కొల్లేరులో చెరువుల అక్రమ సాగుపై ఆరా తీసిన అధికారిని బదిలీ చేశారు. కైకలూరులో సాగుదారులను బెదిరించి వంద ఎకరాల చెరువు తక్కువ మొత్తంతో బలవంతంగా లీజుకు తీసుకున్నారని, నియోజకవర్గంలో అధికార పార్టీ నేతల ఆగడాలకు అంతులేదని, ప్రశ్నిస్తే కేసులతో భయపెడుతున్నారని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. - కైకలూరు

### కొల్లేరు రెగ్యులేటర్ ఎక్కడ జగనన్నా..



ప్రతిపక్ష నాయకుడి హోదాలో జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో కొల్లేరు ఉప్పుటేరుపై రెగ్యులేటర్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. తర్వాత రూ.470 కోట్లతో అంచనా వేసినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ఐదేళ్లు గడిచినా అతిగతీ లేదు. నియోజకవర్గంలో ప్రధాన సమస్య అయిన తాగునీటి ఎద్దడిని పట్టించుకోలేదు. జల జీవన్ పథకంలో కూడా తాగునీరు అందించలేకపోయారు.



కొవ్వెర్ల కోరుకొల్లు మార్గంలో అప్రోచ్ రోడ్డు లేని వంతెన

నియోజకవర్గం ఐదేళ్లగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. అవినీతి, దౌర్జన్యాలు, మాటల గారడీకే పరిమితం. తాగునీటి కోసం అల్లాడుతున్న ప్రజలను పట్టించుకోకపోవడమే గాక కేంద్రం ప్రవేశపెట్టిన జల జీవన్ మిషన్ పథకం ఇంటింటికి ఉచిత మంచినీటి కనెక్షన్ ద్వారా నీరు ఇచ్చిన దాఖలాలు లేవు. మండవల్లిలో రూ.75 లక్షలతో జలజీవన్ మిషన్ ద్వారా నూతనంగా పైపులైన్లు నిర్మాణం అటకెక్కించారు. గ్రామాల్లో రహదారులు నిర్మాణంలో వెనుకబడిపోయారు. గత ప్రభుత్వంలో వేసిన రోడ్లే తప్ప వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత అక్కడక్కడ మాత్రమే రోడ్లు వేశారు.

కోరుకొల్లు క్యాంపెల్ కాలువపై, ఆవకూరు, కోరుకొల్లు సరిహద్దులో ఉన్న పెదలంక డ్రైన్‌పై వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో 15 ఏళ్ల కిందట కొత్త వంతెన నిర్మించారు. దానికి ఇప్పటికీ అప్రోచ్ రోడ్డు వేయ లేదు. కలిదిండిలో వ్యవసాయ రైతుబజారును టీడీపీ ప్రభుత్వంలో 70 శాతం పూర్తి చేసినా ఈ ప్రభుత్వం అసంతృప్తిగానే వదిలివేసింది. పెద లంక డ్రైన్ నిర్మాణం అభివృద్ధి లేక ఈడేపల్లి, పెదగొన్నూరు రైతుల పొలాల నీరు కిందకు వెళ్లకపోవడంతో కనీసం సాగు చేసుకునే పరిస్థితి లేదు. పేదల ఇళ్ల స్థలాలకు భూముల సేకరణలో వైసీపీ నేతలకు కోట్ల రూపాయల అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. కైకలూరులో

### కొల్లేరు గ్రీన్‌జోన్‌కు ముప్పు

కొల్లేరు అభయారణ్య పరిధిలో పది కిలోమీటర్ల మేర ఎలాంటి కర్మాగారాల ఏర్పాటుకు అనుమతి లేదు. కానీ ఫ్యాక్టరీల ఏర్పాటుకు అనుమతుల కోసం ఎమ్మెల్యే కుమారులు సీఎం జగన్‌కు విజ్ఞప్తి చేశారు.

కొల్లేరులో చేపల చెరువుల అక్రమ తవ్వకాలను అడ్డుకున్న ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్‌ను బదిలీ చేయించారు.

ఎమ్మెల్యే మాట కాదని ఎవరైనా గ్రామాల్లో వ్యతిరేకిస్తే ప్రభుత్వ పథకాల్లో కోతలు పెడుతున్నారని వాపోతున్నారు.

ప్రశ్నిస్తే కేసులు ఎదుర్కోవలసివస్తుందని అవినీతిపై తమకు తెలియదన్నట్లు ప్రజలు గుంభనంగా వ్యవహరిస్తున్నారు.

50 మంది రైతులు లీజుకు చేస్తున్న వంద ఎకరాల చేపల చెరువును ఎమ్మెల్యే తనయుడు బలవంతంగా తీసుకున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో ప్రధానమైన ఆక్వాసాగుకు పూర్తిగా మొండిచెయ్యి చూపించారు. యూనిట్ విద్యుత్ రేట్లను రూ.3.80పైసలకు పెంచడమే గాక గత ప్రభుత్వంలో వినియోగించుకున్న విద్యుత్ వాడకానికి సైతం కోట్లలో వసూలు చేస్తున్నారు.

### నెరవేరని హామీలు

- కలిదిండిలో నూతన అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటుకు కనీస ప్రయత్నాలు జరగలేదు.
- ముదినేపల్లి మండలంలో ధాన్యం నిల్వ చేసుకునేందుకు గోదాములు అందుబాటులో లేవు. 24వేల ఎకరాల్లో దాదాపు 600టన్నుల ఉత్పత్తి నిల్వ సామార్థ్యం లేక రైతులు ఇబ్బందులు గురవుతున్నారు.
- ముదినేపల్లిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు ఊసే ఎత్తలేదు.
- కైకలూరు నియోజకవర్గంలో పరిశ్రమలు ఎక్కువగా ఉన్నందున ఈఎస్‌ఐ ఆసుపత్రి ఏర్పాటుకు వినతులు పట్టించుకోలేదు.



పేరూరు వద్ద కూలిన పోల్‌రాజ్ డ్రైన్‌పై వంతెన

- పేరూరులో పోల్‌రాజ్ మెయిన్‌డ్రైన్‌పై వంతెన కూలి 3సంవత్సరాలు అయినా నిర్మాణం జరగలేదు. 3కోట్లతో ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు.
- మండవల్లిలో తరుగుమూలలో 120మందికి ఇళ్ల స్థలాలు మెరక చేసి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. నాలుగున్నరేళ్లుగా పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు.
- మండవల్లి మండలంలో రెండో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన భవనాలు, ఇతర సామగ్రి, మౌలిక వసతులు కల్పించడంలో విఫలమయ్యారు.
- కైకలూరులో పార్కు ఏర్పాటు, పీహెచ్‌సీలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు, 50 పడకల ఆసుపత్రి హామీలు నెరవేరలేదు.
- కైకలూరును పంచాయతీ నుండి మున్సిపాలిటీగా మారుస్తామన్న హామీ ఒక్క అడుగు ముందుకు వెళ్లలేదు.
- పెదలంక డ్రైన్‌పై గరిసేపూడి వద్ద పాతరెగ్యులేటర్ పాడైపోవడంతో కొత్త రెగ్యులేటర్ నిర్మాణం చేస్తామని ఇచ్చిన హామీ నెరవేరలేదు.

### రైతుబజారు లేక ఇక్కట్లు



కలిదిండిలో రైతుబజారు లేక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. పడమటిపాలెం, పరసావానిపాలెం, ఎస్సార్పీ అగ్రహారం, వెంకటాపురం గ్రామాల్లో కూరగాయలు, ఆకుకూరలు పండించే రైతులు వాటిని అమ్ముకోవాలంటే ఇబ్బందులు పడుతున్నారు. దూరప్రాంతాలకు తీసుకువెళ్లి అమ్ముకోవాల్సి వస్తోంది.
ముచ్చు నాగమల్లేశ్వరరావు, కూరగాయల వ్యాపారి

### వంతెనపైకి మార్గం లేదు



కోరుకొల్లు వద్ద పెదలంక డ్రెయిన్‌పై నిర్మించిన ఆవకూరు వంతెనకు అప్రోచ్ రోడ్డు లేదు. ఎన్నో సంవత్సరాలుగా అవస్థలకు గురవుతున్నాం. శిథిలావస్థకు చేరిన వంతెనపై రాకపోకలతో భయాందోళనకు గురవుతున్నాం. వంతెన నిర్మించి పదేళ్ళు గడిచినా నిరుపయోగంగా మారింది.
- కేశిరెడ్డి బలరాం

### పెదలంక డ్రెయిన్ అభివృద్ధి చేయాలి



పెదలంక మేజర్ డ్రయిన్ దిగువన ముంపు నివారణకు దర్శిపూడి యూటి (అండర్ టెన్నెల్) అభివృద్ధి చేయాలి. ఐదేళ్లుగా ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రత్యామ్నాయంగా నిడమర్రు వద్ద రూ.40కోట్లతో రెగ్యులేటర్ నిర్మాణానికి నాయకులు హామి ఇచ్చి నేటికి దాని పనులు ప్రారంభించలేదు.
- రెడ్డి నాగరాజు, స్తంభంచెరువు

### ఒక నియోజకవర్గం..

# రెండు జిల్లాలు

**ఉంగుటూరు, గోపాలపురం ప్రత్యేకం**



ఏలూరు జిల్లాలోని రెండు నియోజకవర్గాలు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో కూడా ఉన్నాయి. పార్లమెంటు నియోజకవర్గాల ప్రాతిపదికన జిల్లా విభజనతో ఉమ్మడి జిల్లా మూడు ముక్కలైంది. గోపాలపురం నియోజకవర్గం తూర్పు గోదావరి జిల్లాలో కలిసింది. ఏలూరు జిల్లాలోని ఉంగుటూరు నియోజకవర్గంలోని గణపవరం మండలం పశ్చిమగోదావరి జిల్లాలో విలీనమైంది. దీంతో ఈ నియోజకవర్గాలలో పోటీ చేసే అభ్యర్థులు రెండు జిల్లాల్లో ప్రచారం చేయాల్సి ఉంది.

ఏలూరు జిల్లాలోని ఉంగుటూరు నియోజకవర్గంలో ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు, గణపవరం మండలాలు ఉన్నాయి. జిల్లాల విభజనతో ఈ నాలుగు మండలాలు ఏలూరు జిల్లాలోనే ఉన్నాయి. గణపవరం మండల ప్రజల విజ్ఞప్తి మేరకు 2022 నవంబరు 10న గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరి జిల్లాలోకి విలీనం చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. దీంతో గణపవరం మండలం ఉంగుటూరు నియోజకవర్గమైనా పశ్చిమగోదావరి జిల్లాలోకి కలసింది. మండలంలో 64,963 మంది జనాభా కాగా 51,895 మంది ఓటర్లు ఉన్నారు.

గోపాలపురం నియోజకవర్గంలో గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండలాలు ఉన్నాయి. ఇందులో గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల మండలాలు జిల్లాల విభజనలో తూర్పుగోదావరి జిల్లాలోకి మారాయి. ఒక్క ద్వారకాతిరుమల మండలం మాత్రం ఏలూరు జిల్లాలోనే ఉండి పోయింది. ద్వారకాతిరుమల రాష్ట్రంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కావడంతో ఈ మండలాన్ని టెంపుల్ సిటీగా పిలుస్తారు. ఈ మండలంలో 68,989 మంది జనాభా కాగా 57,910 మంది ఓటర్లు ఉన్నారు. ఆధ్యాత్మిక క్షేత్రంగా వెలుగొందుతున్న ద్వారకాతిరుమల మండలం తూర్పుగోదావరి జిల్లా కేంద్రానికి దూరంగా ఉండడంతో ఈ మండలాన్ని జిల్లాల విభజన సమయంలోనే ఏలూరు జిల్లాలోనే ఉంచారు. ఇక్కడ ప్రజల అవసరాలకు అనుగుణంగా ఈ మండలం ఏలూరు జిల్లాలోనే ఉండి పోయింది. అయితే గోపాలపురం నియోజకవర్గానికి ఎమ్మెల్యే పోటీ చేసే అభ్యర్థులు రెండు జిల్లాలో తమ ప్రాతినిధ్యాన్ని కొనసాగించాలి. - ఏలూరు సిటీ

# ఎన్నికల ఉపాధి..!

**కూలీలకు ఒకరోజు మస్తరు**
**వైసీపీ జనసేకరణ సిత్రం**



వైసీపీ అభ్యర్థి నామినేషన్‌కు తరలి వెళుతున్న ఉపాధి కూలీలు



పోలవరం బంక్‌లో పార్టీ జెండాలతో ద్విచక్ర వాహనాలు

పోలవరం, ఏప్రిల్ 24: వైసీపీ పోలవరం నియోజకవర్గ అభ్యర్థి నామినేషన్‌కు ఆ పార్టీ శ్రేణులు జనసేకరణకు కొత్త ప్రయత్నాలు చేశారు. పోలవరం మండలంలో ఉపాధి హామీ పథకం కూలీలను నామినేషన్ల కార్యక్రమానికి ఆటోలలో తరలించారు. నామినేషన్ కార్యక్రమానికి వచ్చి వెళ్లినందుకు ఒక్క రోజు పని మస్తరు వేస్తామని, రూ.300, టిఫిన్లు, టీలు, భోజనాలు ఏర్పాటు చేస్తామని ఉపాధి కూలీలను ఆటోలలో తరలించారు. ఈ తతంగంలో ఉపాధి హామీ పథకం మేట్లు, ఇతర ఉపాధి హామీ పథకం సిబ్బంది కూలీలను తరలించారని స్థానికులు చెబుతున్నారు. పోలవరం మండలం నుండి 50 ఆటోలు, 50 కార్లతో భారీ ర్యాలీగా నామినేషన్ కార్యక్రమానికి తరలి వెళ్ళారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ర్యాలీలకు ఆటోలకు కార్లకు తీసుకున్న అనుమతుల పరిమితి దాటి వాహనాలు పెట్టి, నిబంధనలకు విరుద్ధంగా ప్రతి వాహనానికి జెండాలు కట్టి, వాహనాలలో పరిమితికి మించి కూలీలను తరలించారు. ఎన్నికల నిఘా బృందాలు ఎక్కడా కనిపించకపోవడం గమనార్హం. జనసేకరణలో గ్రామ వలంటీర్లు కూడా శక్తివంచన లేకుండా కృషి చేశారు. ప్రగడవల్లి గ్రామానికి చెందిన వలంటీరు నామినేషన్ కార్యక్రమానికి వెళ్లేవారి వాహనాలకు దగ్గరుండి పెట్రోలు కొట్టించి పంపినట్లు స్థానికులు బాహాటంగా చెబుతున్నారు.

### జనం తరలింపులో యానిమేటర్లు, ఉపాధి సిబ్బంది

ఏలూరు: అధికార పార్టీ నేతలు యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. వారికి కొందరు అధికారులు సహకరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఉంగుటూరు వైసీపీ అభ్యర్థి గురువారం నామినేషన్ దాఖలు చేయనున్న నేపథ్యంలో జన సమీకరణకు డ్వాక్రా యానిమేటర్లు, ఉపాధి సిబ్బందిని వాడుతున్నారు. యానిమేటర్లపై రాజకీయ ఒత్తిడితో ఇంటింటికి పంపించి నామినేషన్ ర్యాలీ కోసం తరలి రావాలని చెప్పిస్తున్నారు. పెద నిండ్రకొలను, నిడమర్రు, భువ్వనపల్లి, ఛానమిల్లి, క్రొవ్విడి, అడవికొలను, బావాయిపాలెం గ్రామాల యానిమేటర్లపై రాజకీయ ఒత్తిడి ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌ల ద్వారా ఉపాధి హామీ కూలీలకు నామినేషన్ ర్యాలీకి వెళ్లిన కూలీలకు ఒక రోజు మస్తరు వేస్తామని ఎర వేస్తున్నారు. డి.గోపవరం, అడవికొలను, ఛానమిల్లి, నిడమర్రు, బావాయిపాలెం, క్రొవ్విడి గ్రామాలలో ప్రచారం చేస్తున్నారు. మరో కొత్త కోణం గ్రామా లలో వలంటీర్లు తమ సెల్‌ఫోనుల ద్వారా జగనన్న కాలనీ లబ్ధిదారులకు వైసీపీ అభ్యర్థి వాయిస్ రికార్డింగ్‌లు పెడుతున్నారు. వలంటీర్లతో బలవంతంగా వైసీపీ ప్రచారం చేయిస్తున్నారని పలువురు చెబుతున్నారు.

## పోడూరు రామాలయానికి రూ.10 లక్షలు !

**ఆచంట ఎమ్మెల్యే హామీ**
**సోషల్ మీడియాలో హల్‌చల్**

ఆచంట అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఎన్నికల ప్రచారంలో రామాలయానికి రూ.10లక్షలు ఇస్తానని చెప్పి ఎన్నికల కోడ్ ఉల్లంఘించారంటూ బుదవారం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తుంది. ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీరంగనాధరాజు మంగళవారం సాయంత్రం పోడూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పోడూరు శివారు పూజారివారి గర్వు వెళ్లి అక్కడ నిర్మాణం చేపట్టబోయే రామాలయానికి ఆయన రూ.10లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారని కలకలం రేగింది. స్థానికులకు ఓట్లు కోసం ప్రలోభానికి గురి చేయడమేనంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. దీంతో టీడీపీ నాయకులు ఎన్నికల నియమావళి అతిక్రమించారని ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకువెళ్లనున్నారు. - పోడూరు

### కోడ్ పట్టించుకోండి..




ఎన్నికల నిబంధనలు మీరితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్న అధికారులే నిబంధనలు పట్టించుకోవడం లేదు. ఎన్నికల షెడ్యూలు విడుదలతో కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత నుంచి రాజకీయ నాయకుల ఫొటోలు, బోర్డులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. పోలవరం మండల పరిషత్ ఏర్పాటు చేసిన బోర్డుపై ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే ఫొటోలు ఉన్నా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. - పోలవరం

### బాల నేత !



నేటి బాలలే.. రేపటి పౌరులు అందరికీ తెలిసిందే. పాఠశాల విద్యార్థులే ప్రస్తుత రాజకీయ నేతలు.. సాధారణ ఎన్నికల్లో కనిపిస్తున్న చిత్రమిది. పాఠశాలకు సెలవులు ఇవ్వడంలో రాజకీయ నేతలు విద్యార్థులను కూడా వదలడం లేదు. నామినేషన్ల ర్యాలీకి నేతలు జనాన్ని సమీకరిస్తున్నారు. ఒక బాలుడికి మోటార్ సైకిల్ అందుబాటులో ఉండడంతో రాజకీయ పార్టీ టోపీ తగిలించుకుని ఇదిగో ఇలా బంక్‌లో పెట్రోలు కొట్టించుకుని సిద్ధమయ్యాడు. - పోలవరం

### ఎవరైనా.. పిలిస్తే చాలు..!



ఎన్నికల ప్రచారంలో బిజీ బిజీగా ఉంటున్న అభ్యర్థులు, నాయకులను ఎవరు ఏ కార్యక్రమానికి పిలిచినా వెళ్లాల్సిందే. వారి ప్రచారానికి ఈ కార్యక్రమాలు బ్రేకులు వేస్తున్నాయి. అసలే ఎన్నికల సమయం. తమ పార్టీ వారు కాకపోయినా సరే ఎవరైనా ఏదైనా కార్యక్రమానికి ఆహ్వానిస్తే పోటీలో ఉన్న అభ్యర్థులు తప్పనిసరిగా ఆ కార్యక్రమాలకు వెళ్లి కాసేపు గడుపుతున్నారు. వెళ్లకుంటే ఓట్లు వేయరనే భయం వారిని వెంటాడుతుంది. దీనితో ప్రచారాన్ని పక్కనబెట్టడం లేదు కానీ వెళ్లిన చోటే సొంత పని కూడా చేసుకుంటున్నారు. ఫంక్షన్లలో పాల్గొనే వారినందరిని ఆప్యాయంగా పలకరిస్తూ ఎక్కువసేపు గడిపి పనిలో పనిగా తమకు ఓటు వేయాలని అభ్యర్థించి మరీ వెళుతున్నారు. కార్యక్రమాలకు ఆహ్వానం లేకున్నా అభ్యర్థులు వెళ్లి ఆశీర్వచనం ఇవ్వడంతో పాటు ప్రచారం కూడా చేసుకోవచ్చు. - ముదినేపల్లి

### పోలింగ్ ఏజెంట్లే కీలకం



ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల్లో అభ్యర్థుల తరఫున పరిశీలనకు కూర్చునే ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకం. అభ్యర్థులు నెలల తరబడి నిర్వహించిన ప్రచారం, ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పడిన కష్టానికి ఫలితం ఇచ్చేది పోలింగ్ కేంద్రమే. అటువంటి కేంద్రంలో పోలింగ్ సక్రమంగా జరుగుతుందా? లేదా అన్నది గమనించడం, బోగస్ ఓట్లు పడకుండా ఓటేయడానికి వచ్చిన వారిని నిశితంగా పరిశీలించడం ఏజెంట్ల పని. గుర్తింపు పొందిన, రిజిష్టర్డ్ పార్టీలు, స్వతంత్ర్య అభ్యర్థుల తరఫున ప్రాధాన్యత క్రమంలో ఏజెంట్లు పోలింగ్ కేంద్రాల్లో కూర్చుంటారు. పోలింగ్ కేంద్రంలో జరిగే ప్రతీ కదలిక ఏజెంట్ నిశితంగా పరిశీలించాలి. ఏ మాత్రం అనుమానం వచ్చినా ఏజెంట్ తన అభ్యంతరాన్ని ప్రిసైడింగ్ అధికారికి ఫిర్యాదు చేయవచ్చు. ఎంతో కీలకమైన ఈ ఏజెంట్‌గా అభ్యర్థులు తమకు ఎంతో నమ్మకమైన వారిని కూర్చొబెడతారు. ఏజెంట్ ఏ మాత్రం తప్పు చేసినా ఆ పార్టీ అభ్యర్థికి నష్టమే. - ముదినేపల్లి

### సెంటిమెంట్

**గోమాతకు నమస్కరించి..**



నామినేషన్‌కు బయల్దేరి వెళ్లిన కొలుసు పార్థసారథికి నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద గోమాత ఎదురురావడంతో సారథి గోమాతకు నమస్కరించారు. గోమాత ఆశీర్వాదం తీసుకుని, సబ్ కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి వై.భవానీశంకరికి తన నామినేషన్ పత్రాలు అందజేశారు. వెనుకబడిన వర్గం నుంచి అదీ గోసంరక్షణ ప్రధానంగా ఉండే వర్గం నుంచి వచ్చిన కొలుసు పార్థసారథికి గోమాత ఎదురురావడం శుభపరిణామంగా భావించారు. ఆయన గోమాత ఆశీర్వాదం తీసుకున్నారు.

ఇటీవల ఇదే సామాజికవర్గానికి చెందిన స్వతంత్ర అభ్యర్థి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు నామినేషన్ సమయంలో కూడా ఆవు ఎదురురావడం, ఆయన సైతం గోమాతకు నమస్కరించడం విశేషం. వారి సామాజికవర్గం ప్రధానంగా శ్రీకృష్ణుని, ఆవును కొలుస్తారు. గోమాత వారికి ఎదురురావడం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. - నూజివీడు

### ఈశాన్యం నుంచి ప్రచారం..

**కామినేని శ్రీనివాస్ సెంటిమెంట్**



ముహూర్తం చూసుకుని నామినేషన్‌పై సంతకం చేస్తున్న కామినేని శ్రీనివాస్

ఎన్నికల్లో నాయకులు విజయం సాధించాలని తన సెంటిమెంట్‌ను ఆధారం చేసుకుని ప్రణాళిక రూపొందిస్తూ ఉంటారు. ఏ దిశ నుంచి ప్రచారం ప్రారంభిస్తే కలిసివస్తుంది ఏ సమయానికి ఏ పని చేస్తే విజయం వరిస్తుందో పండితులను ఆశ్రయిస్తారు. కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్ ఎన్నికల ప్రచారాన్ని, నామినేషన్ ప్రక్రియను ముహూర్తం చూసుకుని ప్రారంభించారు. నియోజకవర్గానికి తూర్పున, ఈశాన్యంలో ఉన్న కైకలూరు మండలం ఆలపాడు వినాయకస్వామి ఆలయంలో పూజలు చేసి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ ఎన్నికల ప్రచారానికి పండితులచే ముహూర్తాలు పెట్టించుకున్నారు. ఎన్నికల్లో కీలక ఘట్టమైన నామినేషన్ దాఖలు సమయంలోనూ ఆయన ముహూర్తబలం చూసుకున్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం ఉదయం 11 గంటల తరువాత నామినేషన్ వేయవలసి ఉండగా ముహూర్తబలం ఉదయం 10.48నిమిషాలకు ఉండడంతో ఆ సమయానికి ముందే ఆర్వో కార్యాలయానికి చేరుకుని కచ్చితంగా 10.48 నిమిషాలకు నామినేషన్ పత్రాలపై సంతకం చేసి 11.15 నిమిషాలకు రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేశారు. సెంటిమెంట్ ఆధారంగా ఎన్నికల నిర్వహణ ప్రారంభించడంతో కైకలూరు నియోజకవర్గంలో చర్చనీయంశంగా మారింది. - కైకలూరు

## ఇదీ సంగతి !

# సైకిల్ లేకుండా తొలి ఎన్నికలు



తెలుగుదేశం పార్టీకి నరసాపురం కంచుకోట. 1983 నుంచి ప్రతి ఎన్నికల్లోనూ ఆ పార్టీ పోటీ చేస్తూ వస్తున్నది. ఉప ఎన్నికలతో కలిసి మూడు సార్లు మినహా ప్రతిసారి ఆ పార్టీ అభ్యర్థులే విజయం సాధించారు. అలాంటి నియోజకవర్గంలో తొలిసారి సైకిల్ గుర్తులేకుండా ఎన్నికలు జరుగుతున్నాయి. పొత్తులో భాగంగా ఈ సీటు జనసేనకు వెళ్లింది. 1983, 85లో జోగయ్య విజయం సాధించారు. తరువాత 1986 నుంచి 2009 వరకు ప్రతి ఎన్నికల్లోనూ ఇక్కడ తెలుగుదేశం జెండానే ఎగిరింది. ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భావం తరువాత కొత్తపల్లి టీడీపీకి రాజీనామా చేసి చిరంజీవి పక్షాన చేరారు. ఆ ఎన్నికల్లో టీడీపీ తరుపున బొమ్మిడి నారాయణరావు పోటీ చేసి ఓడిపోయారు. ఇక 2012 ఉప ఎన్నికల్లో టీడీపీ తరుపున డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ పోటీ చేసి ఓటమి చెందారు. 2014 ఎన్నికల్లో బండారు మాధవనాయుడు గెలిస్తే, 2019 ఎన్నికల్లో మళ్లీ బండారు పోటీ చేసి ఓటమి చెందారు. ఈ మూడు ఎన్నికలు మినహా ప్రతిసారి సైకిలే దూసుకుపోతూ వచ్చింది. ఇలాంటి కంచుకోటను అధిష్ఠానం వదులుకోదని టీడీపీ శ్రేణులు భావించారు. అయితే పొత్తులో భాగంగా సీటును జనసేనకు త్యాగం చేయాల్సి వచ్చింది.

- నరసాపురం

## తెలుసుకుందాం..

# బైండోవర్ అంటే ..



ఎన్నికలు ఎప్పుడు వచ్చిన తరచూ వినిపించే మాట బైండోవర్.. అనగా బాండ్ ఫర్ గుడ్ బిహేవియర్. ఎన్నికల జరుగుతున్న సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై అధికారులు ప్రత్యేక నిఘా పెడతారు. అలాగే గొడవలు సృష్టించే వారు, రౌడీషీటర్లు, బెల్టు దుకాణ దారులు, ముఖ్యంగా అసాంఘిక శక్తులపై నిఘా ఉంచుతారు. ఎన్నికల సమయంలో పలానా వ్యక్తుల వలన సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని గ్రహిస్తే అతడి చర్యలు అనుమాన స్పదంగా ఉన్నాయని రుజువైతే పోలీసులు బైండోవర్ చేస్తారు. అటువంటి వారిని తహసీల్దార్, ఆర్డీవో ఎదుట హాజరుపరుస్తారు. ఎన్నికల సమయంలో చట్ట వ్యతిరేక చర్యలు చేయబోమని బాండ్ పేపర్ మీద రాతపూర్వకంగా హామీ తీసుకుంటారు. అలా బైండోవర్ అయిన వ్యక్తి ఆ రోజు నుంచి సంవత్సరం పాటు ఎలాంటి నేరాలకు పాల్పడకూడదు. అలా పాల్పడితే ఇచ్చిన బాండ్ ఎంత మొత్తం నగదు నమోదు చేసి ఉంటారో అంత మొత్తం జరిమానా చెల్లించాలి. అలా చెల్లించకపోతే నేరంగా పరిగణిస్తారు. అతడిపై ఐపీసీ సెక్షన్లు 106, 107, 108, 110 కింద కేసు నమోదు చేస్తారు. అలాగే రెండు అంత కన్న ఎక్కువ సార్లు బైండోవర్ అయితే రౌడీషీట్ నమోదు చేసే అవకాశం ఉంది. అక్రమంగా పోలీసులు బైండోవర్ పెట్టారని ఎవరైనా భావిస్తే హైకోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేసుకోవచ్చు.

-గణపవరం

## అధికారి మాట



అధికారులతో సమీక్ష చేస్తున్న డీఆర్వో ఉదయ భాస్కరరావు

# పోస్టల్ బ్యాలెట్ సద్వినియోగం చేసుకోవాలి : డీఆర్వో

భీమవరం టౌన్, ఏప్రిల్ 24 : అర్హులైన ప్రతీఒక్కరు పోస్టల్ బ్యాలెట్‌ను సద్వి నియోగం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు తెలిపారు.బుధవారం వివిధ శాఖల అధికారులతో డీఆర్వో సమీక్షించారు. వివిధ శాఖలలో పనిచేస్తూ వచ్చేనెల 13న ఓటు వేయడానికి వీలుకాని ప్రతి ఒక్కరూ పోస్టల్ బ్యాలెట్ నమోదు చేసుకొని వచ్చేనెల 6,7,8 తేదీలలో ఫెసిలిటేషన్ సెంటర్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టామన్నారు. 85 సంవత్సరాలు వయసు దాటిన వారు, 40 శాతం వికలాంగత్వం కలిగిన వారు హోమ్ ఓటింగ్‌కు అర్హులని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 1,113 మంది హోమ్ ఓటింగ్‌కు నమోదు చేసుకున్నామన్నారు. అత్యవసర సేవలు అందించు వివిధ శాఖల ఉద్యోగులు పోలింగు రోజు డ్యూటీలో వున్న అత్యవసర సర్వీసులో పనిచేయు 33 శాఖలకు చెందిన ఉద్యోగులకు, అధికారులకు పోస్టల్ ఓటింగు సౌకర్యం కల్పించామన్నారు. వారు పారం- 12డి దరఖాస్తును రిటర్నింగ్ అధి కారికి అందచేసి రిటర్నింగ్ అధికారి వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో వచ్చేనెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వినియోగించుకొనవచ్చునని తెలిపారు. జిల్లా సీప్ నోడల్ అధికారి జి.సి.హెచ్ ప్రభాకర్, జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసరావు, ఆర్టీసీ ఏవో గీతావాణి, ఎక్సైజ్, పోలీస్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునేందుకు 5న ప్రత్యేక సెలవు ఇవ్వాలి

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 24 : ఎన్నికల విధుల్లో వున్న ప్రతీ ఉద్యోగీ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని ఏపీ ఎన్జీవోల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.శ్రీనివాస్, ఎస్.రామారావు విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులందరూ ఫారం-12ని జమచేయడానికి ఈనెల 26 గడువు తేదీగా నిర్ణయించినందున ఎన్నికల సిబ్బంది అందరూ సంబంధిత రిటర్నింగ్ అధికారులకు దరఖాస్తులను అందజేసి ఓటుహక్కు వినియోగించు కోవాల న్నారు. పోస్టల్ బ్యాలెట్‌ను విని యోగించుకునేందుకు ఉద్యోగులందరికీ మే 5న ప్రభుత్వం స్పెషల్ క్యాజువల్ లీవ్‌ను ప్రకటించాలన్నారు. ఏ నియోజక వర్గంలో వున్నా ప్రస్తుతం పనిచేస్తున్న నియోజకవర్గ ఫెసిలిటేషన్ సెంటర్‌లోనే ఓటు వేసుకునే అవకాశం ఉందని వివరించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునేందుకు ఫెసిలిటేషన్ సెంటర్లను అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్వో కార్యాలయాల్లోనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



గోదావరి తీరాన కొలువైన కొవ్వూరు పట్టణం ఆధ్యాత్మిక వాతావరణానికి నెలవు. కొవ్వూరు అఖండ గోదావరి పుట్టుకకు కారణమైన గోష్పాద క్షేత్రం, తదితర క్షేత్రాలతో ఎంతో పవిత్రత కలిగి ఉంది. గోష్పదక్షేత్రంలో వివిధ దేవతామూర్తుల ఆలయాలు భక్తులకు ఆధ్యాత్మిక భావాన్ని పంచుతాయి. ఈ ప్రాంతంలో చెరకు, అరటి, వరి పంటలతో పాటు పసుపు, కంద వంటి వాణిజ్య పంటలు పండిస్తారు. ఇక్కడ ఉన్న వివిధ పరిశ్రమల ద్వారా యువతకు ఉపాధి లభిస్తోంది.. 1983లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి కొవ్వూరు నియోజకవర్గం టిడి పికి కంచుకోటగా నిలిచింది. 1983 నుంచి ఇప్పటివ రకు 9 సార్లు ఎన్నికలు జరిగితే 7 సార్లు టీడీపీ, ఒకసారి కాంగ్రెస్, ఒకసారి వైసీపీ గెలుపొందాయి.

- కొవ్వూరు




## గోదావరి తీరాన

# ప్రశాంత క్షేత్రం

2019 ఎన్నికల ముందు వరకు కొవ్వూరు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఉంది. వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత జిల్లాల పునర్విభజనలో భాగంగా తూర్పు గోదావరిలో కలిసింది. ప్రసుత్త ఎన్నికలు తూర్పుగోదావరి జిల్లా పరిధిలో జరుగుతు న్నాయి.

## ఫ్లాష్ బ్యాక్




### ఆలయాలతో ఆధ్యాత్మిక శోభ
### రాజకీయాల్లో చక్రం తిప్పిన నాయకులు
### పరిశ్రమలతో ఉపాధికి ఊతం

పశ్చిమ గోదావరికి ముఖద్వారమైన కొవ్వూరు పట్టణంలో జిల్లాలో రాజకీయంగా చక్రం తిప్పిన నాయకులున్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీదే హవా. కొవ్వూరు నియోజకవర్గం 1952లో ఏర్పడింది. ఇప్పటి వరకు 14 సార్లు ఎన్నికలు జరిగాయి. ఒక్కసారి కూడా ఇక్కడ ఉప ఎన్నికలు జరగలేదు. 2009 సంవత్సరంలో పునర్విభజన జరిగింది. అప్పటి వరకు కొవ్వూరు నియోజకవర్గంలో ఉన్న నిడదవోలు ప్రత్యేక నియోజకవర్గంగా మార్చారు. గోపాలపురంలో ఉన్న చాగల్లును కొవ్వూరులో కలిపారు. ప్రస్తుతం కొవ్వూరు నియోజకవర్గంలో కొవ్వూరు,చాగల్లు, తాళ్లపూడి మండలా లున్నాయి. 1982లో టీడీపీ ఆవిర్భావం నుంచి 8 సార్లు ఎన్నికలు జరగ్గా ఏడుసార్లు టీడీపీ విజయకేతనం ఎగుర వేసింది. ఐదు సార్లు పెండ్యాల వెంకట కృష్ణారావు టీడీపీ తరపున విజయం సాధించారు. 1999లో కాంగ్రెస్ పార్టీ తరుపున జీఎస్ రావు గెలిపొందారు. 2014 ఎన్నికల్లో ప్రధానంగా టీడీపీ నుంచి కెఎస్ జవహర్ గెలిచారు.

కొవ్వూరు శాసన సభా నియోజకవర్గం తూర్పు గోదావరి జిల్లాలో ఉంది. రాజ మహేంద్రవరం పార్లమెంటు పరిధిలోనిది. కొవ్వూరు నియోజకవర్గంలో కొవ్వూరు మున్సిపాలిటీ, కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి మండలాలు ఉన్నాయి. నియోజకవర్గంలో ఇప్పటివరకు 14 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. 4 సార్లు కాంగ్రెస్ పార్టీ, 7 సార్లు తెలుగుదేశం పార్టీ, రెండుసార్లు స్వతంత్ర అభ్యర్థులు, ఒకసారి వైసిపి అభ్యర్థి గెలుపొందారు.

### ఆధ్యాత్మికతకు నిలయం

కొవ్వూరు...చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన పట్టణం. ప్రపంచంలోనే ఎక్కడా లేని ప్రత్యేకత ఉంది.గోదావరిని ఈ గట్టు నుంచి ఆ గట్టుకు కలుపుతూ నిర్మించిన నాలుగు వంతెనలు గోదావరికి మణిహారాలుగా ఉంటాయి. పట్టణంలోని గోదావరి తీరంలో ఉన్న గోష్పదక్షేత్రానికి వెళితే మనసుకు ఎంతో ప్రశాంతత కలుగుతుంది. కొవ్వూరు పట్టణంలో ఒకవైపు గోదావరి. మరోవైపు ఎటుచూసినా ఆలయాలతో ఆధ్యాత్మిక క్షేత్రంగా నిలిచింది. పిల్లలకు విజ్ఞానం, పెద్దలకు ఆధ్యాత్మికత, ఆహ్లాదాన్ని అందించే గోష్పదక్షేత్రం. ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన గోష్పదక్షేత్రంలో 12 ఏళ్లకు ఒకసారి గోదావరి పుష్కరాలు జరుగుతుంటాయి. ప్రపంచం నలుమూలల నుంచి పుష్కర స్నానమాచరించడానికి కోట్లాది ప్రజలు తరలి వస్తుంటారు.

### ఉద్యాన పరిశోధనలకు నెలవు

పట్టణానికి మరో ప్రత్యేకత డాక్టర్ వైఎస్ఆర్ విశ్వవిద్యాలయం ఉద్యాన పరిశోధన కేంద్రం.15 ఎకరాల్లో ఈ ప్రయోగశాలను 1967లో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి అఖిల భారత స్థాయిలో దుంప పంటలు, అరటి పంటలపై అనేక ప్రయోగాలను చేసి కొత్త వంగడాలను రూపొందిస్తున్నారు. జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభించింది. 272 మెగావాట్ల గ్యాస్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రం, ఆచార్య ఎన్‌జీ రంగా అరటి పరిశోధనా కేంద్రం, బయో విత్తనాల పరిశ్రమలు స్థానిక యువతకు ఉపాధి అందిస్తున్నాయి. రాష్ట్రంలోనే ఏకైక అరటి పరిశోధనా స్థానం కొవ్వూరులో ఉంది.ఈ కేంద్రంలో ప్రధానంగా అరటి, దుంప పంటలైన కంద, చేమ, పెండలం పంటలపై విస్తృత పరిశోధనలు చేపట్టారు. 1995లో కొవ్వూరు బొంత పేరుతో కూర అరటిని ఉత్పత్తి చేశారు. కొవ్వూరు బొంత కంటే మేలైన రకం కెబిఎస్-5 కూర అరటిపై పరిశోధనలు చేస్తున్నారు. అలాగే కెసిఎస్- 3 కంద పై పరిశోధనలు జరుగుతున్నాయి. 2017లో గోదావరి బొంత అనే కూర అరటి రకాన్ని విడుదల చేశారు. అంతే కాకుండా అరటిలో తెగుళ్ళను తట్టుకునేందుకు టిష్యూకల్చర్ అరటి పిలకలను తయారుచేసి ప్రతి ఏడాది 5 లక్షల పిలకలను రైతులకు అందజేస్తున్నారు.





గోష్పదక్షేత్రం

| సంవత్సరం | విజేత | పార్టీ | వచ్చిన ఓట్లు | ప్రత్యర్థి | పార్టీ | వచ్చిన ఓట్లు |
|---|---|---|---|---|---|---|
| 1983 | పీవీ కృష్ణారావు | టీడీపీ | 65,890 | ఎంఏ అజీజ్ | కాంగ్రెస్ | 10,983 |
| 1985 | పీవీ కృష్ణారావు | టీడీపీ | 61,899 | ఇమ్మడి శేషగిరిరావు | కాంగ్రెస్ | 29,116 |
| 1989 | పీవీ కృష్ణారావు | టీడీపీ | 60,116 | ఎండీ రఫీవుల్లాబేగ్ | కాంగ్రెస్ | 52,824 |
| 1994 | పీవీ కృష్ణారావు | టీడీపీ | 60,392 | జీఎస్ రావు | కాంగ్రెస్ | 50,153 |
| 1999 | జీఎస్ రావు | కాంగ్రెస్ | 63,721 | పీవీ కృష్ణారావు | టీడీపీ | 57,187 |
| 2004 | పీవీ కృష్ణారావు | టీడీపీ | 65,329 | జీఎస్ రావు | కాంగ్రెస్ | 63,399 |
| 2009 | టీవీ రామారావు | టీడీపీ | 55,669 | కొయ్యే మోషేన్‌రాజు | కాంగ్రెస్ | 40,191 |
| 2014 | కెఎస్ జవహర్ | టీడీపీ | 74,641 | తానేటి వనిత | వైసీపీ | 61,916 |
| 2019 | తానేటి వనిత | వైసీపీ | 79,892 | వంగలపూడి అనిత | టీడీపీ | 54,644 |

### మంత్రి పదవులు చేపట్టినా అభివృద్ధికి దూరంగా

కొవ్వూరు నియోజకవర్గం నుంచి 2014లో టీడీపీ నుంచి గెలుపొందిన కె.ఎస్. జవహర్ ఎక్సైజ్ శాఖామంత్రిగా, 2019లో వైసీపీ నుంచి గెలుపొందిన తానేటి వనిత మొదట స్త్రీ శిశు సంక్షేమ శాఖ, రెండవ విడతలో హోంమంత్రిగా పనిచేశారు. అయితే ఇద్దరు మంత్రులు నియోజకవర్గంలో చేసినా అభివృద్ధి పెద్దగా లేదనే చెప్పుకోవాలి. ఇద్దరు నియోకవర్గంలో రాజకీయంగా ఆధిపత్యం సాధించే సామాజికవర్గంతో విభేదించడంతో ఇద్దరిని నియోజకవర్గం నుంచి వెరే చోటికి బదిలీ చేయడం జరిగింది.



బుధవారం భీమవరంలో జనసేన అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు, నూజివీడులో టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారధిలు నామినేషన్లు వేశారు. టీడీపీ, జనసేన , బీజేపీ కార్యకర్తలు, నాయకులు భారీ ర్యాలీగా తరలి వచ్చారు. బాణ సంచా కాల్పులు, డప్పు వాయిద్యాల నడుమ అభ్యర్థులు కోలాహలంగా నామినేషన్ వేసేందుకు వెళ్లారు



నూజివీడులో మోటార్ సైకిళ్ల ర్యాలీ

## ఎన్నికల ప్రక్రియ సంసిద్ధత పరిశీలన

ఏలూరు సిటీ, ఏప్రిల్ 24 : ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం, దెందులూరు, ఏలూరు, ఉంగుటూరు అసెంబ్లీ నియోజక వర్గాల సాధారణ ఎన్నికల పరిశీలకులు కృష్ణకాంత్ పాఠక్ ఆయా నియోజక వర్గాలలో ఎన్నికల ప్రక్రియ సంసద్ధతను పరిశీలించారు. ఫిర్యాదులు, సూచనలను కలెక్టర్ కార్యాలయం సమీపంలోని రెవెన్యూ గెస్ట్‌హౌస్‌లో పాఠక్‌కు సమర్పించవచ్చు. లేదా 91546 90377కు ఫోన్ చేసి తెలపవచ్చు.

## కలెక్టర్‌ను కలిసిన జిల్లా ప్రత్యేక పోలీస్ పరిశీలకుడు

ఏలూరుసిటీ, ఏప్రిల్ 24 : ఎన్నికల సంఘం ద్వారా ఏలూరు జిల్లా ప్రత్యేక పోలీస్ పరిశీలకులు (అబ్జర్వర్)గా నియమితులైన కర్నాటక రాష్ట్రానికి చెందిన ఐపీఎస్ అధి కారి పి.శ్రీధర్ బుధవారం కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌ను కలెక్టర్ ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్నికల నేపథ్యంలో తీసుకున్న చర్యలను తెలుసుకున్నారు.

## 75 మంది వలంటీర్లకు నోటీసులు

కలిదిండి, ఏప్రిల్ 24 : కలిదిండిలో ఈ నెల 20న నిర్వహించిన వైసీపీ నేతల సమావేశంలో పాల్గొన్న 75 మంది వలంటీర్లకు నోటీసులు జారీ చేసినట్టు ఎంపీడీవో దినతేజ్ తెలిపారు. వీఎస్‌టీ టీమ్ వీడియో ఆధారంగా రాజీనామా చేసిన వాళ్లతో పాటు విధుల్లో ఉన్న వలంటీర్లను గుర్తించినట్టు చెప్పారు. నోటీసులకు సమాచారం ఇవ్వడానికి 48 గంటల గడువు ఇచ్చినట్టు తెలిపారు.

## రూ. 13.74 కోట్లు విలువైన సామగ్రి సీజ్

### సువిధలో 2,129 అభ్యర్థనలు పరిష్కారం : కలెక్టర్ వెంకటేశ్

ఏలూరుసిటీ, ఏప్రిల్ 24: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈఎస్ఎంఎస్ కింద చేపట్టిన సీజర్ మేనేజ్‌మెంట్ ప్రక్రియ ద్వారా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు జిల్లా వ్యాప్తంగా రూ. 13.74 కోట్లు విలువైన నగదు, బంగారం, మద్యం , ఇతర వస్తువులు సీజ్ చేశామని ఏలూరు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్నవెంకటేష్ తెలిపారు. ఇందులో రూ. 206.35 లక్షలు నగదు, రూ. 10.17 కోట్లు విలువైన బంగారం, వెండి ఆభరణాలు, రూ.143.24 లక్షలు విలువ చేసే మద్యం స్వాధీన పరచుకున్నామన్నారు. జిల్లా ప్రచార అనుమతుల కోసం సువిధ/ ఎన్‌కోర్ ద్వారా ఎన్నికల ప్రచారం కోసం 2,167 అభ్యర్థనలు రాగా వాటిలో ఇంతవరకు 2,129 అనుమతులు జారీ చేయగా మిగిలిన 38 పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. సి-విజిల్ ద్వారా 410 ఫిర్యాదులను పరిష్కరించామని తెలిపారు. ఎన్‌జీఎస్పీ పోర్టల్ ద్వారా 643 ఫిర్యాదులు స్వీకరించగా వీటిలో 638 పరిష్కరించామన్నారు.



### రూ.2.96 లక్షలు స్వాధీనం

ద్వారకాతిరుమల/ఉంగుటూరు ఏప్రిల్24: ద్వారకాతిరుమల మండలం రాళ్లకుంట వద్ద ఓ మహిళ వద్దనున్న రూ. 2 లక్షలు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం బుధవారం పట్టుకున్నారు. ఐఎస్ రామానుజపురానికి చెందిన ఓ మహిళ ద్వారకా తిరుమల నుంచి స్వగ్రామానికి వెళ్తున్న సందర్భంగా బృంద సభ్యులు తనిఖీలు చేసి ఈ నగదును సీజ్ చేసి ద్వారకాతిరుమల తహసీల్దారు రవికాంత్‌కు అప్పగించారు. ఉంగుటూరు ఫ్లైయింగ్ స్క్వాడ్ టీం జరిపిన తనిఖీలలో బుధవారం రూ.95 వేలు స్వాధీనం చేసుకున్నారు.

### వాహనాల తనిఖీ

ఏలూరు క్రైం, ఏప్రిల్ 24 : ఏలూరు నగరంలో పోలీసులు బుధవారం సాయంత్రం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. త్రి టౌన్ సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో త్రిటౌన్ ఎస్ఐలు ప్రసాద్, రామారావు సిబ్బందితో నగరంలోని వాహనాలను తనిఖీలు చేశారు.

## కూలి డబ్బులు కూడబెట్టి నామినేషన్

దెందులూరు, ఏప్రిల్ 24 : దెందులూరు నియోజక వర్గ ఇండిపెండెట్ ఎమ్మెల్యే అభ్యర్థిగా చల్లచింతలపూడి గ్రామానికి చెందిన రోజు కూలీ నూతి రవీంద్రగౌడ్ (జైగౌడ సంఘం నాయకుడు) నామినేషన్ దాఖలు చేశారు. వెల్డింగ్ పనులు చేసే గౌడ్ నాలుగు నెలలుగా కూడపెట్టిన కూలీ సొమ్ములు రూ.10 వేలు డిపాజిట్‌గా కట్టారు. బుధవారం జై గౌడసేన సమితి నాయ కులతో కలిసి ఊరేగింపుగా వచ్చి దెందులూరు ఎన్నికల రిటర్నింగ్ కార్యాల యంలో ఆర్వో లావణ్య వేణికి నామినేషన్ పత్రాలను అందజేశారు. రవీంద్ర గౌడ్ మాట్లాడుతూ బీసీలను రాజ్యాధికారానికి దూరంగా ఉంచుతున్నారని వారిని కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నారన్నారు. వెనుకబడిన వర్గాల చెందిన ప్రతినిధిగా ఐక్యత చాటేందుకు ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నానని తనకు మద్దతు పలకాలని కోరారు.



ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేస్తున్న రవీంద్రగౌడ్



## మాధవరంలో అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠ

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 24: మాధవరంలో అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠ కన్నుల పండువగా నిర్వహించారు. మూడు రోజులుగా పూజలు నిర్వహించిన అనంతరం బుధవారం స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు.

## మావూరమ్మ జాతరలో ఊయల సేవ



ఆలయం వద్ద అమ్మవారి ఘటాలను ఉంచి ఊయలలు ఊపుతున్న భక్తులు

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్, 24 : బంగారు వారి చెరువుగట్టున ఉన్న శ్రీ మావూరమ్మ జాతరలో భాగంగా బుధవారం ఉదయం ఆలయం వద్ద ఊయల సేవలు జరిపించారు. అమ్మవారికి (ఘటాలకు) దంపతులు ఊయలలు ఊపి మొక్కులు తీర్చుకున్నారు. వందలాది మంది మహిళలు అమ్మవారికి చలివిడి పానకాలను సమర్పించుకున్నారు. మంగళవారం రాత్రి జాతర అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ శంకరావు శ్రీనివాసరావు, సభ్యులు కర్నేన గౌరునాయుడు, కర్నేని రోజారమణి, అభిషేక్, జూహి దంపతులు, రౌతు అచ్యుతరావు, డొమ్మేటి వెంకట్రావు, మేడిదివారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



అధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించిన దృశ్యం

## విద్యార్థులకు క్రమశిక్షణ, పట్టుదల ఉండాలి

భీమవరం రూరల్, ఏప్రిల్ 24 : పట్టుదల, క్రమశిక్షణ విద్యార్థి దశ నుంచి అలవర్చుకోవాలని డీఈవో ఆర్.వెంకటరమణ అన్నారు. పీఎస్ఎం గరల్స్ హైస్కూల్లో 2023-24 పదో తరగతి ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అభినందన సత్కార కార్యక్రమం బుధవారం నాడు నిర్వహించారు. డీఈవో వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వారంతా మధ్యతరగతి, పేదవారేనని అన్నారు. అరసవల్లి సుబ్రహ్మణ్యం, చెరుకువాడ రంగసాయి, కలిగొట్ల గోపాల్‌శర్మ పాల్గొన్నారు.

## 26న ధ్వజ స్తంభ ప్రతిష్ఠ

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్, 24 : పట్టణంలోని సలాది వారి తోట (20వ వార్డు)లో సీతారామ సహిత దాసాంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 26వ తేదీన 45 అడుగుల రాతి ధ్వజ స్తంభ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. 25వ తేదీన గణపతి పూజ, అనంతరం ఆలయం వద్ద అఖండ అన్న సమారాధన ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు కొర్రగింజల రవిశంకర్, సుబ్బారావు, మేడిశెట్టి కేశవరావు, భోగా సత్యనారాయణ, జోగి నాగేశ్వరరావు తెలిపారు.

## గోపాలపురం పరిశీలకులుగా వీరవల్లి

కాళ్ళ, ఏప్రిల్ 24 : తెలుగుదేశం పార్టీ పశ్చిమ గోదావరి జిల్లా అధికార ప్రతినిధి వీరవల్లి శ్రీనివాస్‌ను తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గం పరిశీలకులుగా నియమిస్తూ పార్టీ ఆదేశించింది. ఈమేరకు శ్రీనివాస్ బుధవారం గోపాలపురం నియోజకవర్గంలో జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. గోపాలపురం ఎన్డీయే అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజు, ఎన్డీయే రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి దగ్గుపాటి పురందేశ్వరిని కలిసి ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.

## డిఫెన్స్ అకాడమీ ఏర్పాటు అభినందనీయం



భోగేశ్వరరావును సత్కరిస్తున్న అపుస్మా నాయకులు

పెంటపాడు, ఏప్రిల్ 24: టీబీఆర్ సైనిక్ స్కూల్లో డిఫెన్స్ అకాడమీ ఏర్పాటు అభినందనీయమని అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడు జి. బుల్లబ్బాయి, బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ అన్నారు. టీబీఆర్ సైనిక్ స్కూల్లో బుధవారం సంస్థ అధినేత తనుబుద్ధి భోగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన అపుస్మా జిల్లా సభ్యుల సమావేశంలో వారు మాట్లాడుతూ మిలిటరీలోను, ఎస్ఎస్‌సీ బోర్డులో సేవలందించిన ఆస్కార్‌దాస్ అకాడమీ విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం అకాడమీ భవనాన్ని ప్రారంభించారు. బీజేపీ మండల అధ్యక్షుడు దత్తు ప్రసాద్, అపుస్మా నాయకులు జంగా బాలాజీ, సుంకర శ్రీనివాస్, గుణ్ణం చిరంజీవి, టీబీఆర్ కరస్పాండెంట్ పద్మావతి, డైరెక్టర్ రవికిరణ్, ప్రిన్సిపాల్ బాలమురళి, హెచ్ఎం కల్యాణి, ఏవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కలిగొట్ల, ఆరేడు గ్రామాల్లో రఘురామ ప్రచారం



కలిగొట్లలో ప్రచారం చేస్తున్న అభ్యర్థి రఘురామ కృష్ణరాజు, ఎమ్మెల్యే రామరాజు

ఉండి, ఏప్రిల్ 24: సీఎం జగన్మోహన్‌రెడ్డి గురించి మాట్లాడుకోవడం శుద్ధ వేస్టని ఉండి అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. బుధవారం కలిగొట్ల, ఆరేడు గ్రామాలలో ఎమ్మెల్యే మంతెన రామరాజు, జనసేన ఇన్‌చార్జి జుత్తుగ నాగరాజుతో కలిసి రఘురామ కృష్ణరాజు ప్రచారం చేశారు. గ్రామంలో మాజీ సర్పంచ్ శిరవరపు సత్యవతి ఆధ్వర్యంలో మహిళలు హారతి ఇచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎంఎస్, గ్రామ టీడీపీ అధ్యక్షులు రుద్రరాజు యువరాజు, గొట్టం వెంకటేశ్వరరావు, మాజీ ఎంపిటీసీ నీలం సూర్యనారాయణ, మండల టీడీపీ అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి జుత్తుగ శ్రీను పాల్గొన్నారు.

**పాల కోడేరు:** గొల్లలకోడేరులో రఘురామకృష్ణరాజుకు మద్దతుగా ఆయన సతీమణి రమాదేవి బుధవారం ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈమెకు తోడుగా టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు, టీడీపీ బీసీ నాయకుడు కామన రాంబాబు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు కమ్మిలి రాంబాబు, గాదిరాజు సూర్యనారాయణరాజు, సాల మల్లేశ్వరరావు, కొండపల్లి ఏసురత్నం, తదితరులు ఉన్నారు.

**ఆకివీడు:** సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమిదే విజయమని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కనుమూరి రఘురామ కృష్ణరాజు తనయుడు భరత్ అన్నారు. వెలంపేట రామాలయంలో ముందుగా ప్రత్యేక పూజలు చేసిన అనంతరం టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో కలిసి వార్డులలో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించి తన తండ్రికి ఓటేసి గెలిపించాలని కోరారు.

## ఎమ్మెల్యే రామరాజుకు సత్కారం

ఉండి, ఏప్రిల్ 24:ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజును జిల్లా టీడీపీ అధ్యక్షుడుగా నియమించబడడంతో స్థానిక ప్రజలు ఎమ్మెల్యే అభ్యర్థి రఘురామకృష్ణరాజు చేతుల మీదుగా ఘనసత్కారం చేశారు. కలిగొట్లలో జరిగిన సభలో ఎమ్మెల్యే రామరాజుకు పూలమాలలు వేసి శాలువాను కప్పి, జ్ఞాపికను ఇచ్చి సత్కరించారు.

## రోడ్డు మధ్యలో నిలిచిపోయిన లారీ

పెనుమంట్ర, ఏప్రిల్ 24 : మార్టేరులోని నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో అతివేగంగా వచ్చిన లారీ స్పీడ్ బ్రేకర్ల వద్ద అదుపుతప్పడంతో లారీ కమాన్ కట్టలు విరిగి రోడ్డు మధ్యలో నిలిచిపోయింది దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మార్టేరు కాటన్ వంతెన వద్ద ఉన్న స్పీడ్ బ్రేకర్ల వద్ద ఈ సంఘటన చోటు చేసుకుంది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇసుక లోడు లారీ రోడ్డు మధ్యలో నిలిచిపోవడంతో రాకపోకలు కష్ట సాధ్యంగా మారింది.



వార్డుల్లో ప్రచారం చేస్తున్న తణుకు టీడీపీ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ.. కృష్ణతులసి దంపతులు

# గంజాయి పాపం వైసీపీ నేతలదే: ఆరిమిల్లి

తణుకు, ఏప్రిల్ 24: రాష్ట్రాన్ని గంజాయి మత్తులో ముంచిన పాపం పూర్తిగా వైసీపీ ప్రభుత్వానిదే అని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. బుధవారం పైడిపర్రులోని 31, 34 వార్డుల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తణుకు పట్టణంలో గంజాయి వ్యాపారం మాఫియాగా మారిందని, పెద్ద సంఖ్యలో యువత చనిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని పట్టించుకోకుండా నిద్ర నటిస్తున్న ఎమ్మెల్యే కారుమూరికి ఈ పాపంలో వాటా ఉన్నట్లే అని తెలిపారు.

### అభివృద్ధికి ఆరిమిల్లి మార్కు ప్రణాళిక

తణుకు నియోజకవర్గ అభివృద్ధికి ఆరిమిల్లి మార్కు ప్రణాళిక పెట్టుకున్నామని ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణతులసి అన్నారు. బుధవారం 16వ వార్డులో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 'నా భరోసా' పేరుతో ఆరిమిల్లి రాధాకృష్ణ రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను ఆమె అందించారు. తణుకు మొదటి నుంచీ పారిశ్రామిక ప్రాంతమని, ఐదేళ్ళుగా ఒక పరిశ్రమ గానీ, సంస్థగానీ ఏర్పడలేదని వివరించారు. పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు కల్పనకు రాధాకృష్ణ పూనుకున్నారని పేర్కొన్నారు.

### ఆరిమిల్లి ప్రజా మేనిఫెస్టో

ఆరిమిల్లి రాధాకృష్ణ తణుకు నియోజకవర్గ ప్రజల కోసం 'నా భరోసా' పేరుతో ప్రజా మేనిఫెస్టోలో మొదటి అంశం విడుదల చేశారు. ప్రధానంగా కొత్త రహదారుల నిర్మాణం, డ్రెయినేజీ సమస్య పరిష్కారం, పారిశుధ్యం సక్రమంగా నిర్వహించడం, ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాల నిర్మాణం, టిడ్కో ఇళ్ళు నిర్మాణం పూర్తిచేసి పంపిణీ చేయడం, విద్య, ఐటీ, మెడికల్ హబ్‌ల ఏర్పాటు.. ప్రతి గ్రామంలోని కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం.

### టీడీపీ హయాంలో ఒకటవ తేదీనే జీతాలు

రాష్ట్రం విడిపోయిన తర్వాత కొత్తగా ఏర్పడిన నవ్యాంధ్ర రాష్ట్రంలో టీడీపీ హయాంలో చంద్రబాబు ఉద్యోగులకు, పెన్షనర్లకు ఒకటినే జీతాలు, పెన్షన్లు వేసిన సందర్భాలను గుర్తు చేసుకోవాలని ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. బుధవారం ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ సచివాలయ సంఘం మాజీ అధ్యక్షుడు పి.గురవయ్య, ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జి. పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

# వైసీపీని సాగనంపాలి: బొలిశెట్టి



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 24: సంక్షేమం ముసుగులో ఎస్సీ బీసీ కార్పొరేషన్ రుణాలను దారి మళ్ళించి అవినీతి సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్న వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని ఉమ్మడి జనసేన అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణంలోని 13వ వార్డులో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీతో కలసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి మాట్లాడుతూ నా ఎస్సీ లు అంటూనే దళితులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. సీఎం జగన్ మాయమాటలు నమ్మేందుకు మరోసారి ప్రజలు సిద్ధంగా లేరన్నారు. వలవల బాబ్జి మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో అవినీతి పాలన పోవాలంటే ఉమ్మడి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్‌ను భారీ మెజారిటీ తో గెలిపించాలన్నారు. గొర్రెల శ్రీధర్, పట్నాల రాంపండు, వర్తనపల్లి కాశి, గంధం సతీష్, బండి పెద్దిరాజు, పాలూరి వెంకటేశ్వరరావు, దాట్ల జగన్నాథరాజు పాల్గొన్నారు.

### తాడేపల్లిగూడెంలో వైసీపీకి కష్టకాలం

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 24: తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో వైసీపీకి కష్టకాలం ఎదురవుతోంది. పార్టీలో కీలక నాయకులు రాజీనామాలు చేస్తున్నారు. కూటమిలో చేరుతున్నారు. వ్యాపారవేత్త, బిల్డర్ మారం వెంకటేశ్వరరావు తన అనుచరులతో ఇటీవల జనసేన పార్టీలో చేరారు. మారం పార్టీ మారకుండా అధికార పార్టీ నేతలు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అలాగే మంత్రి కొట్టు సత్యనారాయణకు ముఖ్య అనుచరునిగా ఉన్న మరో వ్యాపారస్తుడు ఉంగరాల శ్రీనివాస్ జనసేన తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీకి పట్టణంలో తొలి నుంచీ వెన్నుదన్నుగా ఉన్న రజకసంఘం అధ్యక్షుడు అడ్డాల నరసింహరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి చింతకాయల సత్యనారాయణలు తెలుగుదేశంలో చేరిపోయారు. అలాగే నాయిబ్రాహ్మణ సంఘంలో కీలకంగా ఉంటున్న భవానీ శంకర్‌కూడా టీడీపీలో చేరిపోవడంతో వైసీపీకి పెద్ద తగిలినట్టయ్యింది.



పెన్షనర్ల సంఘం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పితాని.. ప్రచారంలో పితాని కోడళ్లు

# ఉద్యోగుల నడ్డి విరిచిన జగన్‌ను ఓడించాలి: పితాని

పెనుమంట్ర, ఏప్రిల్ 24 : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను, పెన్షదారులను, సామాన్య ప్రజానీకాన్ని నడ్డి విరిచిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని చిత్తుగా ఓడించాలని అఖిల భారత రాష్ట్ర పెన్షనర్ల సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి జి.పూర్ణచంద్రరావు పిలుపునిచ్చారు. బుధవారం పొలమూరులో 'చంద్రబాబు గెలుపు పెన్షనర్ల పిలుపు' కరపత్రాన్ని ఆచంట టీడీపీ అభ్యర్థి పితాని సత్యనారాయణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఉద్యోగులు ఉపాధ్యాయులు పెన్షనర్లకు చెల్లించవలసిన పీఆర్‌సీబీఏలు, జీపీఎఫ్ మెడికల్ బిల్లులు చెల్లించాల్సి ఉందని అన్నారు

### పితాని కోడళ్లు ప్రచారం

పెనుగొండ, ఏప్రిల్ 24: ఆచంట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి పితాని సత్యనారాయణ గెలుపు కోసం కోడళ్ళు నాగ సాహిత్య, స్వాతి బుధవారం దొంగరావిపాలెంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటూ నిత్యం ప్రజా సేవలో ఉన్న పితాని సత్యనారాయణకు సైకిల్ గుర్తు పై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. రాష్ట్రంలో ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుద్యోగ యువతీ యువకులకు మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు భర్తీ చేస్తారన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్‌లు ఉచితంగా ఇస్తారన్నారు.

### బాబుతోనే రాష్ట్రాభివృద్ధి

ఆచంట, ఏప్రిల్ 24: అన్నివిధాలా నష్టపోయిన రాష్ట్రం మరలా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే అది చంద్రబాబు ద్వారానే సాధ్యమని టీడీపీ నేతలు అన్నారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలపై బుధవారం ఆచంట చినపేటలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

# సత్యసాయి సేవా కేంద్రంలో ఆరాధనోత్సవం

తణుకు, ఏప్రిల్ 24 : తణుకులోని సత్యసాయి సేవా కేంద్రంలో బుధవారం స్వామివారి ఆరాధనోత్సవం సందర్భంగా ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వేదపారాయణ, నామ సంకీర్తన, భక్తులకు నారాయణ సేవ జరిగింది. అలాగే తణుకు రైల్వే స్టేషన్ వద్ద సాయి యువత, బాలవికాస్ విద్యార్థులతో రిక్షా, భవన నిర్మాణ కార్మికులు 45 మందికి చెప్పులు, టోపీలు అందించినట్టు సేవా కేంద్రం కన్వీనర్ ఒక ప్రకటనలో తెలిపారు.



రిక్షా కార్మికులకు చెప్పులు, భోజనాలు అందజేత

# అభివృద్ధే పనులే గెలిపిస్తాయి-స్వతంత్ర అభ్యర్థి శివ

ఆకివీడు, ఏప్రిల్ 24: పట్టణ పరిధిలో గత పదిహేనేళ్లుగా తాను చేసిన సేవలు, అభివృద్ధే తనను గెలిపిస్తాయని స్వతంత్ర అభ్యర్థి వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. బుధవారం స్థానిక 1, 2, 14, 18, 19, 20 వార్డులలో ఆయన విస్తృత ప్రచారం నిర్వహించి మాట్లాడారు. పదేళ్లుగా ఎమ్మెల్యేగా తనను ప్రజలు ఆదరించారని ఇప్పుడు కూడా ఆదరించాలన్నారు. ఈయన వెంట పెద్ద ఎత్తున జనం పాల్గొన్నారు.



శివకు హారతి ఇస్తున్న మహిళలు

## వాకర్స్ క్లబ్ వితరణ

పాలకొల్లు రూరల్, ఏప్రిల్ 24 : పట్టణానికి చెందిన ఇద్దరు పేదలైన వృద్ధులకు వైద్య ఖర్చులు నిమిత్తం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మందులు పంపిణీ చేశారు. గుండె రక్తనాళాలు సమస్యతో బాధపడుతున్న కుంపట్ల శ్రీనివాస్, తాతవోలు శ్రీనివాసాచార్యులుకు రూ.10వేలు విలువైన మందులను బుధవారం క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకర్ ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి పీర్ సాహెబ్, పి.ఉమాశంకరరావు, మానెం బసవ రాజు, ఆదుర్తి రాధాకృష్ణ పాల్గొన్నారు.

# చించినాడలో ఎమ్మెల్యే నిమ్మల ప్రచారం



తిల్లపూడిలో సూర్యకుమారి.. చించినాడలో ఎమ్మెల్యే నిమ్మల ప్రచారం

యలమంచిలి, ఏప్రిల్ 24: కొవిడ్ కష్టకాలంలో వైద్య సేవలు అందించిన ఆశా వర్కర్లను గుర్తించి గౌరవించామని ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. చించినాడ గ్రామం పెదపేట, దళితవాడల్లో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు రెండవరోజు బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మంగళవారం రాత్రి అక్కడే బస చేసిన ఎమ్మెల్యే ఉదయాన్నే కాలకృత్యాలు తీర్చుకుని పాదయాత్ర కొనసాగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల మాట్లాడుతూ బీసీ, ఎస్సీలకు అధిక ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రుద్రరాజు సత్యనారాయణరాజు, మామిడిశెట్టి పెద్ది రాజు, బొప్పన హరికిషోర్, రేపూరి బాల కృష్ణ, కొడవటి వరబాబు, జడ్డు రామకృష్ణ పాల్గొన్నారు.

### రైతులకు నిమ్మల అండ

పాలకొల్లు రూరల్ , ఏప్రిల్, 24: నియోజక వర్గంలో రైతులు కష్టకాలంలో ఉన్నప్పుడు నేనున్నాను అంటూ అండగా నిలిచింది ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడేనని రామానాయుడు భార్య సూర్యకుమారి అన్నారు. తిల్లపూడిలో సూర్యకుమారి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎమ్మెల్యే రామానాయుడును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ నాయకులు కామిశెట్టి అయ్యప్ప నాయుడు, ఇంటి శ్రీరాముడు, నీలం నారాయణ, బోడపాటి కాశీ, రామాంజనేయులు పాల్గొన్నారు.

## రూ.40 లక్షల ఖర్చు దాటితే అభ్యర్థులు అనర్హులు



మాట్లాడుతున్న ఆర్వో స్వామి నాయుడు

ఆచంట, ఏప్రిల్ 24: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చు రూ. 40 లక్షలు దాటితే నిబంధనలు 90 అనుసరించి అనర్హులుగా గుర్తించడం జరుగుతుందని ఆచంట నియోజకవర్గ ఎన్నికల అధికారి వి. స్వామి నాయుడు తెలిపారు. బుధవారం ఎన్నికల కార్యాలయం వద్ద పొలిటికల్ స్టాండింగ్ కమిటీ సమావేశం పొలిటికల్ పార్టీ నాయకులతో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభ్యర్థుల ఎన్నికల వ్యయాల అకౌంట్‌లు సమర్పించడానికి అవసరమైన విధానాన్ని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. నియోజకవర్గంలో 86 మంది హోమ్ ఓటింగ్‌కు గుర్తించడం జరుగుతుందన్నారు. మే నెల 2,3 తేదీలల్లో హోమ్ ఓటింగ్ ఉంటుందన్నారు. నామినేషన్ ప్రక్రియ అనంతరం ఈ నెల 26న నామినేషన్‌ల పూరిటి ఉంటుందన్నారు. నామినేషన్ వేసిన అభ్యర్థులతో పాటు మరో ముగ్గురికి కూడా నామినేషన్ స్క్రూట్నీలో పాల్గొనే అవకాశం ఉందన్నారు. 187 పోలింగ్ స్టేషన్‌ల తుది జాబితాను రాజకీయ నాయకులు అందజేశారు. తహసీల్దార్‌లు, ఎంపీడీవో పాల్గొన్నారు.

## గ్రామాల్లో అభివృద్ధి శూన్యం

ఇరగవరం, ఏప్రిల్ 24 : వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాల్లో అభివృద్ధి శూన్యమని మాజీ జడ్పీటీసీ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చుక్కా సాయిబాబు ఆరోపించారు. ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణను గెలిపించాలని కోరుతూ పేకేరు, తూర్పు విప్పర్రు, కె.కుముదవల్లి, సూరంపూడి గ్రామాల బూత్ కన్వీనర్లు, గృహ సారథులు, గ్రామ ముఖ్య నాయకులతో సమావేశాలు నిర్వహించారు. ఉమ్మడి మేనిఫెస్టో ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. మండల ఇన్‌చార్జి బోడపాటి నారాయణరాజు, మండల అధ్యక్షుడు గోపిశెట్టి రామకృష్ణ, కార్యదర్శి బొంతు శ్రీను, వీరవల్లి పాలేశ్వరరావు, కనుకు సత్తిబాబు, సత్తి సూర్య ప్రకాష్‌రెడ్డి, కొల్లి అప్పారావు, సత్యనారాయణ, టీడీపీ, జనసేన, బీజేపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగులు ఓటుహక్కు వినియోగించుకోవాలి



దాసం నాగేశ్వరరావును సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 24: విశ్రాంత ఉద్యోగులంతా ఓటుహక్కు వినియోగించుకోవాలని సంఘ అధ్యక్షుడు కె. బాలకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో బుధవారం సంఘ సమావేశం నిర్వహించారు. ఇటీవల గుంటూరులో జరిగిన సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన దాసం నాగేశ్వరరావును సత్కరించారు. సంఘ నాయకులు వీఎస్ఎన్ మూర్తి, ఎండి ముస్తఫా, బాపయ్య శర్మ తదితరులు పాల్గొన్నారు.

## సీతారాంపురంలో చలివేంద్రం ఏర్పాటు

నరసాపురం రూరల్, ఏప్రిల్ 24: సీతారాంపురం గ్రామంలో బుధవారం సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సినీ కమెడియన్లు జోగి, రామచంద్రరావు ప్రారంభించారు. అనంతరం చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజుతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

### 'వైసీపీ ఓటమి ఖాయం'



ప్రచారం చేస్తున్న జనసేన అభ్యర్థి నాయకర్, కొత్తపల్లి, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి

నరసాపురం, ఏప్రిల్ 24: ఎన్నికల్లో వైసీపీ ఓటమి ఖాయమని మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు అన్నారు. బుధవారం పట్టణంలోని 10 వార్డులో జనసేన అభ్యర్థి నాయకర్‌తో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. ప్రజల కోసం పని చేసే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని కోరారు. ఈఎన్నికల్లో వైసీపీ ఎన్ని హామీలు ఇచ్చినా ప్రజలు మాత్రం కూటమికే పట్టం కడతారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అధికారి అనంతరామారావు, గుగ్గిలపు మురళీ, జక్కం శ్రీమన్నారాయణ, సంకు భాస్కర్, వలవల నాని, కోటిపల్లి వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

**మొగల్తూరు:** ప్రజా సంక్షేమ కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ ఎమ్మెల్యే బందారు మాధవ నాయుడు పిలుపునిచ్చారు. బుధవారం మొగల్తూరు పంచాయతీలో జనసేన అసెంబ్లీ అభ్యర్థి బొమ్మిడి నాయకర్, ఆయన సతీమణి సునీత, ఆయన కుమార్తె శ్రేయలతో కలిసి ఆయన ఇంటింట ప్రచారం నిర్వహించారు. పలు చోట్ల నాయకర్, మాధవ నాయుడులకు మహిళలు హారతులు ఇచ్చారు.




## నిండుకుండలా మంచినీటి ప్రాజెక్టులు

నరసాపురం రూరల్, ఏప్రిల్ 24: వేసవిలో తీర ప్రాంతంలో తాగునీటి ఎద్దడి లేకుండా ఉండేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మండలంలోని అన్ని ప్రాజెక్టులు, గ్రామాల్లోని మంచినీటి చెరువులను నీటితో నింపారు. దీంతో ఈ చెరువులన్నీ నిండుకుండలా జలకళతో దర్శనమిస్తున్నాయి. పంట కాల్వలకు నీటి సరఫరా ఇచ్చే వరకు ప్రాజెక్టుల్లోని నీళ్ల సరిపోయ్యే విధంగా నిరంతరం మోటార్ల సాయంతో తోడుతున్నారు. లక్ష్మణేశ్వరం, తూర్పుతాళ్ళు, రుస్తుంబాద ప్రాజెక్టులు ఇప్పటికే నిండాయి.

## వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు

తణుకు, ఏప్రిల్ 24: తణుకులో వైసీపీకి గట్టి షాకు తగిలింది. వైసీపీ నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు బుధవారం ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో చేరగా వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జగన్ అసమర్థ పాలనకు తోడు నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే కారుమూరి అరాచకాలు భరించలేనివిగా మారాయన్నారు. దుర్మార్గ పాలనకు విసుగు చెందిన అనేక మంది వైసీపీని వీడుతున్నారన్నారు. కూటమితోనే సుపరిపాలన సాధ్యమని నమ్మి టీడీపీలో చేరుతున్నారని చెప్పారు. కారుమూరి ముఖ్య అనుచరుడు బొద్దాని రామకోటేశ్వరరావు కుటుంబ సమేతంగా 200 మంది టీడీపీలో చేరారు.

## మేడేను జయప్రదం చేయండి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 24: మేడేను కార్మిక లోకం విజయవంతం చేసి ప్రభుత్వాలకు కార్మిక శక్తిని చాటి చెప్పాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు మామిడి దాన వరప్రసాద్ పిలుపునిచ్చారు. పెదతాడేపల్లి పీఎం దాల్ మిల్ కార్మికులతో ఐఎఫ్‌టీయూ కరపత్రాన్ని బుధవారం ఆవిష్కరించి మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తోందని ఆ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలన్నారు. డి. వెంకట్రావు, పులపాకల రాములు, డి. రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఏడుగురు వలంటీర్ల రాజీనామా

ఆకివీడు, ఏప్రిల్ 24: ఆకివీడు మండలంలో బుధవారం ఏడుగురు వలంటీర్లు రాజీ నామా చేశారని ఎంపీడీవో వై.రామకృష్ణ తెలిపారు. ఆకివీడు-5లో 1, కుప్పనపూడి- 5, అప్పారావుపేట, టరటావలో-1 వలంటీర్లు రాజీనామ చేశారన్నారు.



శిక్షణలో పాల్గొన్న శాస్త్రవేత్తలు

## శాస్త్రవేత్తలు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 24: శాస్త్రవేత్తలు రోజురోజుకు పెరుగుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుని, పంటలకు ఏర్పడే కొత్త వ్యాధుల పట్ల రైతులను అప్రమత్తం చేయాలని ఉప కులపతి డాక్టర్ టి. జానకిరామ్ సూచించారు. వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన వర్సిటీ ఆవరణలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రాష్ట్రంలోని కేవీకేల శాస్త్రవేత్తలకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఐసీఏఆర్ జోనల్ డైరెక్టర్ షేక్ ఎస్ మీరా ఆన్‌లైన్ ద్వారా శాస్త్రవేత్తలకు పలు సూచనలు చేశారు. పరిశోధనా సంచాలకులు ఎల్. నారం నాయుడు, విస్తరణా సంచాలకులు ఇ. కరుణశ్రీ తదితరులు మాట్లాడారు.

## ప్రజల కోసమే జనసేన

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 24: ప్రజల కోసమే జనసేన పనిచేస్తుందని పార్టీ ఆవిర్భావం నాడే తమ అధినేత పవన్ తాను అధికారం కోసం కాదు ప్రశ్నించడం కోసం రాజకీయాల్లోకి వస్తున్నానని చెప్పి పదేళ్లుగా నిజాయితీగా రాజకీయాల్లో ఉన్నారని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆరుగొలనుకు చెందిన వైసీపీ నాయకుడు అడపా శ్రీనివాస్ మిత్ర బృందం బుధవారం బొలిశెట్టి శ్రీనివాస్ సమక్షంలో జనసేనలో చేరారు.

# పేదోడి ఫ్యాన్... తాటాకు విసన కర్ర

## విద్యుత్ కోతలతో గిరాకీ.. జత రూ.40

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్, 24 :పెరుగుతున్న ఎండ వేడి, దానికి తోడు విద్యుత్ కోతలతో పేద, మధ్య తరగతి ప్రజలు ఉక్కబోత, ఎండ వేడిమికి తాళలేకపోతున్నారు. సామాన్యులు గతకాలపు ఫ్యాన్లు (తాటాకు విసన కర్రలు) కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. మార్కెట్‌లో తాటాకు విసన కర్రల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతం, తూర్పు గోదావరి జిల్లాలో మెట్ట ప్రాంతంలో తయారు అయ్యే తాటాకు విసన కర్రలు గతంలో జత 10 లేదా 15 రూపాయలు ఉండేది. డిమాండ్ పెరగడంతో ఒకొక్క విసన కర్ర రూ.20లకు (జత రూ.40) విక్రయిస్తున్నారు. ప్రస్తుతం విసన కర్రలను దూరప్రాంతం నుంచి తీసుకువస్తున్నామని వ్యాపారి ఏలేటిపాడుకు చెందిన తానేటి వెంకన్న తెలిపాడు. మున్సిపల్ పన్ను, రవాణ ఖర్చులతో పాటు కొన్ని పాడైపోతాయని, అందువల్ల కనీసం చిల్లరగా జత రూ. 40లు అయితే కానీ గిట్టుబాటు కాదని వ్యాపారి వెంకన్న తెలిపాడు

